

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY







PUBLISHED FROM KURNOOL   ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి   గురువారం18-08-2022   సంపుటి : 04   సంచిక : 03   పేజీలు : 4   వెల : రూ 3-00


## హామీలు గుప్పించకుండా పార్టీలను నిరోధించలేం : ఉచితాలపై సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ : ఉచితాలపై డీఎంకే దాఖలు చేసిన పిటిషన్‌పై సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. హామీలను గుప్పించకుండా రాజకీయ పార్టీలను నియంత్రించలేమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ రమణ స్పష్టం చేశారు. ప్రజల సంక్షేమ ప్రభుత్వాల భాధ్యతని, ప్రజా ధనాన్ని సరైన పద్ధతిలో వెచ్చించడమే ఇక్కడ ప్రధాన అంశమని సీజేఐ నొక్కిచెప్పారు. ఈ వ్యవహారం చాలా సంక్లిష్టమైనదని, అసలు ఈ అంశాలను న్యాయస్థానం పరిశీలించ వచ్చా అనే ప్రశ్న కూడా తలెత్తుతుందని అన్నారు. ఎన్నికల్లో ఉచిత హామీల అంశంపై డీఎంకే మంగళవారం సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలను ఎన్నికల తాయిలాలుగా పేర్కొనరాదని డీఎంకే వాదిస్తోంది. విస్తృత, బహుళ ఉద్దేశాలతో సంక్షేమ పథకాలు అమలవుతాయని పేర్కొంది. కోర్టు సూచనలను పరి గణనలోకి తీసుకుని కమిటీని ఏర్పాటు చేయాలని పిటిషనర్ హన్సరియా కోరారు. తాము ఈ అంశంలో జోక్యం చేసుకుంటూ పిటిషన్ వేశామని, భారత్ సంక్షేమ రాజ్యమని, సంక్షేమ పథకాలు అవసరమని కమిటీ ఏర్పాటును తాము వ్యతిరేకిస్తున్నామని డీఎంకే తరపు న్యాయవాది పీ విల్సన్ కోర్టుకు నివేదించారు.

# వైద్య ఆరోగ్య శాఖపై సమీక్ష..



### సీఎం జగన్ కీలక ఆదేశాలు

తాడేపల్లి: రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సంబంధిత మంత్రులతో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఆరోగ్యశ్రీ విధానంపై సీఎం సమీక్షించారు. పార్వతీపురం

మన్యం జిల్లాలో వైద్య కళాశాల ఏర్పాటు చేయాలని సీఎం జగన్ ఆదేశించారు. గణనీయంగా చికిత్సా విధానాలను పెంచుతున్నట్లు సీఎం జగన్ ప్రకటించారు. కొత్తగా ఆరోగ్యశ్రీ పరిధిలోకి 754 ప్రొసీజర్లను అనుమతించారు. మొత్తంగా ఆరోగ్యశ్రీ కింద 3,118 చికిత్సా విధానాలు వచ్చాయి. ఇకపై కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుగా మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు వ్యవహరించనున్నారు.

# రాష్ట్రంలో అరిస్టోక్రాటిక్ పాలన

### జగన్ రెడ్డి అసమర్ధ పాలనతో యువత భవిష్యత్ ప్రమాదంలో పడింది

### అవినీతి, అరాచక, అసమర్ధ పాలకుల్ని యువత తరిమికొట్టాలి

### యనమల రామకృష్ణుడు



అమరావతి ఎన్నికలముందు యువతకు అనేక హామీలిచ్చి వారి ఓట్లు దండుకొని అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి వారి నెత్తిన భస్మాసుర హస్తం పెట్టారని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు ఆరోపించారు. డొల్ల పరిపాలనలో యువతకి ఉపాధి కల్లగా మిగిలిపోయింది. అధికారంలోకి రాగానే మొట్ట మొదట చేసే పని ఖాళీగా వున్న 2.30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయ్యడమేనన్నారు. ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని యువతని బులిపించి అధికారంలోకి వచ్చారు. మూడేళ్లు దాటినా ఎటువంటి జాబ్ క్యాలెండర్ విడుదల చెయ్యకుండా నిరుధ్యోగులను వంచించారు. ఉధ్యోగ, ఉఫాది కల్పనలో రాష్ట్రం పరిస్థితి దయనీయంగా మారింది. ముఖ్యంగా పారిశ్రామిక రంగాన్ని ప్రాధాన్యతా రంగంగా గుర్తించక పోవడంతో రాష్ట్రంలో నిరుధ్యోగ యువత భవిత ప్రశ్నార్ధకమయింది. ఏటా లక్షలు ఖర్చు పెట్టి వివిధ కోర్సులు పూర్తి చేసి బయటికి వస్తున్న యువతకి ఉధ్యోగ, ఉపాది చూపే విధానాలు అమలు చేసే సమర్ధత ఈ ప్రభుత్వానికి లేదు. భాధ్యత, సమర్ధత లేని,అబద్దాల పరిపాలనలో యువత భవిత ప్రమాదంలో పడిందని అన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలో కొత్తగా వచ్చే పెట్టుబడులేవు. ఉద్యోగాలు లేవు. నిరుద్యోగ సంక్షోభం కారణంగా చదువుకొన్న విద్యార్థుల భవిష్యత్ అగమ్యగోచరంగా మారింది. పలువిభాగాల్లో కాళీగా వున్నఉద్యోగాల భర్తీకి కార్యాచరణ లేదు. వచ్చిన పెట్టుబడులు వెనక్కి వెళ్ళిపోయి,రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులు లేక నవ్యాంధ్రలో నిరుద్యోగాభివృద్ధి దిన,దినాభివృద్ధి చెందుతుంది. నిరుద్యోగం పెరిగి అసమానతలు పెరిగిపోతున్నాయి. 75 శాతం పరిశ్రమల్లో స్థానికులకే ఉద్యోగాలన్న జగన్ రెడ్డి కొత్తగా రాష్ట్రానికి పరిశ్రమలు, పెట్టుబడులు తీసుకురాగపోగా ? కమీషన్ల కోసం ఉన్న కంపెనీలను తరిమేసి 34 లక్షల మంది యువత భవిష్యత్ ను నాశనం చేశారు.?కాంట్రాక్టు ఉద్యోగుల్ని రెగ్యులైజ్ చేస్తానన్న జగన్ రెడ్డి అధికారంలోకి రాగానే తూచ్ అని వారిని రెగ్యులైజ్ చేయకపోగా ఉన్న ఉద్యోగాలు ఊడగొట్టి రోడ్డున పడేశారు. ఏపీపీఎస్సీని అక్రమాలకు నిలయంగా మార్చి అనర్హులకు ఉద్యోగాలు కట్టబెట్టి వ్యవస్థ ప్రతిష్ట మంటగలుపుతున్నారు. టీడీపీ ప్రభుత్వం ప్రతి నెలా 6 లక్షల మందికి నిరుద్యోగ భృతి ఇస్తే జగన్ రెడ్డి రద్దు చేసి నిరుద్యోగులకు ద్రోహం చేశారు. వైసీపీ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఉపాధి లేకుండా పోయింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పోరేషన్లు, సబ్సిడితో బ్యాంకు రుణాల ద్వారా నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పిస్తే జగన్ రెడ్డి వాటిని రద్దు చేసి నిరుద్యోగుల పొట్టకొట్టారు. అ.ఓ.ఎ.ఇ నివేదిక ప్రకారంరాష్ట్రంలో గ్రాడ్యుయేషన్స్ అన్ ఎంప్లాయిమెంట్ రేటు 33.6 శాతానికి పెరిగి బీహార్ సరసన చేరింది. దీనికి కారణం ఎవరో, జగన్ రెడ్డి పాలనలో యువతకు జరిగిన అన్యాయంపై యువత ఆలోచించాలి. ఉద్యోగం,ఉపాది,శిక్షణ అందుబాటులో లేక యువత కుంగుతున్న తీరు ఆందోళనకరం. యువతలో ఆశలు పెంచారు ఆచరణ లో విఫల మయ్యారు. ప్రత్యేక హోదా సాధించి ఉధ్యోగాల విప్లవం తెస్తానని యువతకు ఆశపెట్టిన జగన్అధికారంలోకి వచ్చాక హోదా పై పిల్లిమొగ్గలు వేసి తన కేసుల మాఫీకోసం హోదాను కేంద్రానికి తాకట్టు పెట్టారు. అడుగడుగునా వంచించే ప్రభుత్వం అధికారంలో వున్నప్పుడు యువత వివేకవంతం కావాలి.

## కాణిపాకం బ్రహ్మోత్సవాలకు రావాలని ఏపీ సీఎంకు ఆహ్వానం

అమరావతి : ఈనెల 31 నుంచి ప్రారంభం కానున్న కాణిపాక వరసిద్ధుడు వార్షిక బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని ఏపీ సీఎం జగన్కు ఆలయ అధికారులు ఆహ్వాన పత్రం అందజేశారు. పూతలపట్టు ఎమ్మెల్యే ఎమ్ఎస్ బాబు, కాణిపాకం దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ మోహన్‌రెడ్డి, ఆలయ ఈవో సురేశ్ బాబు తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సీఎంను కలిసి బ్రహ్మోత్సవాలకు రావాలని కోరారు. సెప్టెంబర్ 20 వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని వివరించారు. ఈ నెల 21న జరగనున్న చతుర్వేదహవన సహిత మహా కుంభాభిషేకం ఆహ్వానపత్రికను అందజేశారు. ఆహ్వాన పత్రాలను ముఖ్యమంత్రికి అందజేసిన అనంతరం ఆలయ వేద పండితులు స్వామివారి ప్రసాదాలు, వస్త్రం అందజేసి వేద ఆశీర్వచనం ఇచ్చారు.



## టీచర్లను బోధనకు దూరం చేసి వదిలించుకొనే కుట్ర: నాదెండ్ల మనోహర్

అమరావతి : రాష్ట్రంలో ఉపాధ్యాయులను బోధనకు దూరం చేసి వదిలించుకొనే కుట్ర మొదలైందని జనసేన పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ విమర్శించారు. బుధవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడమే వైసీపీ ఆలోచనని, అందులో భాగంగానే వేధింపులు మొదలయ్యాయన్నారు. ఇంటి గడప దాటి సచివాలయానికి వెళ్లని సీఎం జగన్ కూడా హాజరు గురించి చెబుతున్నారని ఎద్దేవా చేశారు. పాఠశాల విద్యను పేదలకు దూరం చేసే కుట్రకు వైసీపీ ప్రభుత్వం తెర తీసిందని ఆరోపించారు. ఉపాధ్యాయులను వదిలించుకుని, ప్రభుత్వ స్కూల్స్ బైజూస్ లాంటి ప్రైవేట్ సంస్థలకు అప్పగించే ఆలోచన చేస్తోందని, దీనికి సంస్కరణలు, సాంకేతికత వినియోగం లాంటి ముసుగు వేస్తోందని విమర్శించారు. ఇప్పుడు ఉపాధ్యాయుల హాజరుకి సంబంధించి ఫేస్ రికగ్నిషన్ యాప్ అని గందరగోళపరుస్తున్నారని నాదెండ్ల అన్నారు. ఇంటి గడప దాటి సచివాలయానికి వెళ్లని ముఖ్యమంత్రి ఉపాధ్యాయుల హాజరులో నిమిషం ఆలస్యమైతే ఆబ్సెంట్ అంటూ ఉత్తర్వులు ఇప్పించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆయన ఎప్పుడూ సచివాలయానికి వెళ్లకపోవడం వల్ల అభివృద్ధి పటంలో ఏపీ ఆబ్సెంట్ అయిపోయిందని నాదెండ్ల మనోహర్ వ్యాఖ్యానించారు.



## కాపు జనసేన కాదు కమ్మ జనసేన : ఏపీ మంత్రి



అమరావతి : ఏపీ మంత్రి గుడివాడ అమర్నాథ్ జనసేన పార్టీపై తీవ్ర విమర్శలు చేశారు. పవన్ కల్యాణ్ నడుపుతున్నది కాపు జనసేన పార్టీ కాదని కమ్మ జనసేన పార్టీ అని ఎద్దేవా చేశారు. ఇవాళ మీడియా సమావేశం లో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో పవన్ కల్యాణ్ రెండు నాల్కల దోరణి వ్యవహరిస్తుండడం తో కాపులు ఆయనకు ఓట్లు వేయడం లేదని ఆరోపించారు. టీడీపీ నాయకులు కొందరు దురుద్దేశంతో ఏపీ సీఎం వైఎస్ జగన్ సతీమణి వైఎస్ భారతిని లాగుతున్నారని ఏపీ మంత్రి మండిపడ్డారు. మరోసారి భారతి గురించి మాట్లాడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించా రు. ఇవాళ ఆయన మీడియా సమావేశంలో మాట్లాడా రు. టీడీపీ నాయకుడు నారా లోకేశ్‌కు బ్రాహ్మణితో ఏదైనా ఉంటే ఇంట్లో తేల్చుకోవాలని హితవు పలికారు. రాజకీయాల్లో ఉన్న వారిపై ఆరోపణలు, ప్రత్యారోపణలు సహజ మని, అయితే ఏనాడు రాజకీయాల్లోకి రాని భారతి గురించి విమర్శలు చేయడం మానుకోవాలని సూచించారు.

## ఆ దెబ్బకు ఉన్న పరిశ్రమలు పారిపోయాయి: అచ్చెన్నాయుడు



అమరావతి: జగన్ రెడ్డి పాలనలో పరిశ్రమలకు శ్రమలు వచ్చిపడ్డాయని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు రాకపోగా జే ట్యాక్స్ దెబ్బకు ఉన్న పరిశ్రమలు పారిపోయాయన్నారు. ఏపీలో ఏదైనా కంపెనీ పెట్టాలంటే పేపర్లు తీసుకుని రిజిస్ట్రేషన్ ఆఫీస్‌కి వెళ్లటం ముందే కమిషన్లు తీసుకుని తాడేపల్లి ప్యాలెస్‌కి వెళ్లాలని సూచించారు. 3 ఏళ్లలో జగన్ రెడ్డి విదేశాల నుంచి తెచ్చిన పెట్టుబడుల కంటే తన విదేశీ పర్యటనలకు చేసిన ఖర్చే ఎక్కువ అన్నారు. టీడీపీ హయాంలో ఒప్పందాలు కుదిరిన పరిశ్రమలకు జగన్ రెడ్డి శంకుస్థాపనలు చేసి అది తన ఘనతగా ప్రచారం చేసుకోవటం సిగ్గుచేటన్నారు. పరిశ్రమలపై క్రెడిబులిటీ చంద్రబాబుదయితే పబ్లిసిటీ జగన్ రెడ్డిదని ప్రజలే అంటున్నారని పేర్కొన్నారు. వైసీపీ క్యాలెండర్‌లో ఆగస్టులో ఎంస్.ఈసీలకు పారిశ్రామిక రాయితీలిస్తామన్నారు, కానీ ఇంతవరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. 2018 స్టార్టప్ ర్యాంకింగ్స్‌లో ఏపీ దేశంలోనే మొదటి స్థానంలో నిలిస్తే 2020-21 లో స్టార్టప్ ర్యాంకింగ్స్‌లో చిట్టచివరన బీహార్ సరసన చేరిందన్నారు. 3 ఏళ్ల పాలనలో జగన్ రెడ్డి చేసిన తప్పులు, అప్పులతో పాటు నిరుద్యోగం కూడా పెరిగిందన్నారు. జగన్ రెడ్డి 3 ఏళ్లలో రాష్ట్రానికి ఎన్ని పరిశ్రమలు తెచ్చారో ఎంతమందికి ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు.

## వివేకానంద స్ఫూర్తితో ముందుకు సాగితే విజయాలు సొంతం : మంత్రి రోజా



అమరావతి : నేటి యువత స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకుని ముందుకుసాగితే విజయాలు సొంతమవుతాయని ఏపీ మంత్రి రోజా అన్నారు. లక్ష్యసాధనలో వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలని ఆమె సూచించారు. చిత్తూరు జిల్లా పుత్తూరు ఎస్.ఆర్.ఎస్ ప్రభుత్వ కళాశాలలో స్వామి వివేకానంద విగ్రహాన్ని ఆమె ఆవిష్కరించారు. యువతను సన్మార్గంలో నడవడానికి స్వామిజీ చేసిన బోధనలు యువత పాటించాలని కోరారు. లక్ష్యసాధనలో యువత విఫలమైతే లక్ష్యం సాధించేవరకు ప్రయత్నిస్తూనే ఉండాలని సూచించారు. ఆదర్శవంతమైన సమాజం ఏర్పాటుకు యువత నడుము కట్టాలని పిలుపునిచ్చారు.

# సంపాదకీయం

గురువారం 18-08-2022

## ఉచితాలు... అనుచితమా

ఉచిత పథకాలపై మళ్లీ జోరుగా చర్చ జరుగుతోంది. సహజంగానే ప్రజల కోసం అమలయ్యే ఉచిత పథకాల చుట్టూనే ఇదంతా తిరుగుతోంది. .దేశంలో 90వ దశకం మొదట్లో ఆర్థిక సంస్కరణల అమలు మొదలయ్యాక సమాజంలో ఆర్థిక అంతరాలు విపరీతంగా పెరిగాయి. కొన్ని అట్టడుగు కులాలకు మాత్రమే పరిమితమై ఉండే వృత్తుల్లోకి సైతం సంపన్నవర్గాలు భారీ పెట్టుబడులతో ప్రవేశించి లాభార్జన మొదలుపెట్టాయి. వారితో సరితూగలేక అట్టడుగు కులాలు మరింత పేదరికంలోకి జారుకున్నాయి. సంస్కరణల అనంతరం వచ్చిన సేవారంగం చూస్తుండగానే విస్తరిస్తూ పోతున్నా అందులో ఉద్యోగావకాశాలు బాగా నైపుణ్యం ఉన్నవారికి మాత్రమే పరిమితమయ్యాయి. నైపుణ్యం అవసరంలేని ఉద్యోగాల్లో కుదురుకున్నవారు సైతం ఆ ఉద్యోగాల స్వభావరీత్యా ఎదుగూ బొదుగూ లేకుండా ఉండిపోయారు. పైగా అవి ఎప్పుడు ఉంటాయెా, పోతాయెా తెలియని కొలువులుగా మిగిలిపోయాయి.బడా వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు లక్షల కోట్ల మేర ఎగ్గొట్టిన బ్యాంకు రుణాలు రద్దవుతున్న వైనం గురించి మాత్రం ఎవరూ మాట్లాడటం లేదు. బహుశా ఇలా రద్దు చేయడం ఉచితాలకిందకు రాదన్న అభిప్రాయం చర్చిస్తున్నవారికి ఉన్నట్టుంది. గత నెలలో ఒక సభలో మాట్లాడిన ప్రధాని నరేంద్ర మోదీ ఉచిత పథకాలు ప్రకటించడాన్ని 'మిఠాయిల సంస్కృతి'గా అభివర్ణించారు. ఈ సంస్కృతికి అడ్డదారి రాజకీయంగా కూడా ఆయన పేరుపెట్టారు. ఉచితపథకాల వల్ల ఆర్థికాభివృద్ధి నాశనమవుతుందన్నారు. ఆయన దీన్ని ప్రత్యేకించి ఎందుకు లేవనెత్తారో తెలియంది కాదు.వచ్చే డిసెంబర్‌లో జరగబోతున్న గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలకు ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) నేత, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఇప్పటికే ప్రచారం మొదలుపెట్టారు. మహిళలకు ప్రతి నెలా వేయి రూపాయలు ఇవ్వడంతోసహా బోలెడు ఉచిత పథకాలను ప్రకటిస్తున్నారు. ఇక తన ముందు దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ధర్మాసనం చేస్తున్న వ్యాఖ్యలు మీడియాలో ప్రముఖంగా వస్తున్నాయి. మధ్య తరగతి, ఆ పై తరగతులవారికి అన్ని రకాల ఉచిత పథకాలపైనా ఎప్పటినుంచో అభ్యంతరం ఉంటోంది. వారి ఉద్దేశం ప్రకారం ఉచిత రేషన్ మొదలుకొని ఉపాధి హామీ పథకం వరకూ అన్నీ వ్యర్థమైనవే. తాము కట్టే పన్నుల ద్వారా సమకూడే రాబడిని ప్రభుత్వాలు ఉచిత పథకాలకింద ప్రజలకు ఇస్తూ వారిని సోమరులను చేస్తున్నాయన్న అభిప్రాయం వారిదిఇవి చాలదన్నట్టు చంద్రబాబువంటి నేతలు అంతవరకూ నిరుపేదలకు ప్రభుత్వాసుపత్రుల్లో దొరికే ఉచిత వైద్యానికి కూడా యూజర్ చార్జీలు విధించారు. రైతులు మొదలుకొని అట్టడుగు కులాల వరకూ అనేకులు బతకడానికి దోవలేక ఆత్మహత్యలు చేసుకున్నారు. సుప్రీంకోర్టులో దాఖలైన పిల్ విచారణ సందర్భంగా సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా 'అహేతుక ఉచిత పథకాలు' అవినీతితో సమానమన్న పిటిషనర్ వాదనను సమర్థించారు. కానీ ఒక పథకం అహేతుకతమైనదో, సహేతుకతమైనదో నిర్ణయించేదెవరు? సుప్రీంకోర్టు ప్రతిపాదించిన నిపుణుల కమిటీ వంటివి ఆ అంశాన్ని నిర్ణయించగలవా? నిపుణులు తటస్థులనీ, అన్ని అంశాలపైనా వారికి సమగ్ర అవగాహన ఉంటుందని, వారి అభిప్రాయాలు శిరోధార్యమని భావించడం ఈ ప్రతిపాదన వెనకున్న భావన కావొచ్చు. కానీ నిపుణుల్లో ఉచితాలు సంపూర్ణంగా రద్దు చేయాలని వాదించేవారున్నట్టే, వాటిని కొనసాగించటం అవసరమని కుండబద్దలు కొట్టేవారున్నారు ఉచిత పథకాలపై ఏ పార్టీకైనా నిర్దిష్టమైన అభిప్రాయం ఉందా? అనుమానమే. ఎందుకంటే ఉచిత పథకాలను మిఠాయి సంస్కృతిగా అభివర్ణించిన మోదీయే పలు సందర్భాల్లో అసెంబ్లీ ఎన్నికలప్పుడు ఉచిత పథకాల గురించి ఏకరువుపెట్టిన ఉదంతాలున్నాయి. అంతెందుకు? విదేశీ బ్యాంకుల్లో మూలుగుతున్న నల్లధనాన్ని రప్పించి, ప్రతి ఒక్కరి జేబులో రూ. 15 లక్షలు వేస్తామని 2014 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో మోదీ చేసిన ప్రకటన దేనికిందికొస్తుంది? అసలు ప్రజల ప్రమేయం లేకుండా ఉచిత పథకాల గురించి చర్చించడం దండగ. అన్ని పార్టీలూ ఎన్నికల్లో ఉచిత పథకాలు ప్రకటిస్తున్నప్పుడు వారిలో ఎవరో ఒకరినే జనం ఎందుకు విశ్వసిస్తున్నారు? వారినే ఎందుకు గెలిపిస్తున్నారు? 2014 అసెంబ్లీ ఎన్నికల్లో అలవిమాలిన హామీలిచ్చి అధికారం అందుకున్న చంద్రబాబును, వాగ్దానాల అమలులో చతికిలబడ్డాక 2019 ఎన్నికల్లో అదే జనం ఓడించలేదా? ప్రజాక్షేత్రాన్ని విస్మరించి, ప్రజలు ఎన్నుకున్న చట్టసభలను పరిగణనలోకి తీసుకోకుండా ఉచితాల గురించి చర్చించడం వృథా ప్రయాస.

# టీచర్ కు గ్రూపుల లొల్లి

విశాఖపట్టణం, ఆగస్టు 17, వంగలపూడి అనిత. తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు. పాయకరావుపేట మాజీ ఎమ్మెల్యే. టీచర్ వృత్తి నుంచి రాజకీయాల్లోకి వచ్చి.. తక్కువ కాలంలోనే టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలుగా ఎదిగారు. 2014లో తొలిసారి పాయకరావుపేట నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన ఆమె.. ఆ ఐదేళ్ల కాలంలో నియోజకవర్గంపై పట్టు సాధించలేకపోయారు. ఎస్సీ రిజర్వ్ స్థానమే అయినప్పటికీ భిన్నమైన సామాజిక సమీకరణాల ప్రభావం ఎక్కువ. ఆ కారణంగానే 2019లో అనితకు ఇక్కడ టికెట్ ఇవ్వలేదు టీడీపీ. ఎక్కడో దూరంగా ఉన్న కొవ్వూరు నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఆ ఓటమి తర్వాత తిరిగి పాయకరావుపేటకు షిఫ్ట్ అయ్యారు అనిత.తెలుగు మహిళ అధ్యక్షురాలిగా రాష్ట్ర రాజకీయాల్లో బిజీగా ఉంటూ.. జిల్లా నాయకత్వంతో అంటీ ముట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు అనిత. ఐతే, నియోజకవర్గం లేకపోతే పార్టీ యాక్టివిటీ తప్ప రెండో మాట ఎత్తడం లేదు. దీని వెనక ఆసక్తికరమైన కారణాలు ఉన్నాయనేది అంతర్గత చర్చ. అప్పట్లో గంటా శ్రీనివాస్ కోటరీలో అనిత ఉన్నారనే ప్రచారం జరిగేది. గంటాతో అయ్యన్న పాత్రుడికి ఉన్న గొడవల కారణంగానే అనితకు టికెట్ ఇవ్వలేదనే చర్చ సాగింది. ప్రస్తుతం గంటా రాజకీయంగా సైలెంట్ అయితే.. అయ్యన్న కీలకంగా ఉన్నారు. దాంతో అయ్యన్న టీమ్‌కు అనిత చేరువ అయినట్టు సమాచారం.మళ్లీ గ్రూపులు, వాటి చుట్టూ తిరిగే రాజకీయాల్లోకి అడుగుపెడితే నష్ట తప్పదనే భయం అనితలో కనిపిస్తోందట. అందుకే జిల్లాలో వున్నప్పటికీ పార్టీ కార్యక్రమాలకు మినహా ఎక్కడా కనిపించడం లేదట. నియోజకవర్గంలో టీడీపీకి అండగా ఉన్న వారిని మెజారిటీ స్థాయిలో తనవైపు తిప్పుకొంటే?తప్ప అనితకు అవకాశాలు మెరుగుపడవు. ఈ దిశగా అవసరమైతే 40 అడుగులు వెనక్కి తగ్గడమే మేలని భావిస్తున్నారట. వీటి వెనక మరో కోణం ఉందట. ఇటీవల చంద్రబాబు జిల్లాలో నియోజకవర్గాల వారీగా సమీక్షలు చేశారు. పాయకరావుపేటలో పార్టీ పరిస్థితిపై చర్చ జరిగినప్పుడు అక్కడ నాయకత్వానికి, అనితకు ఒకే తరహాలో క్లాస్ పీకారట బాబు. విభేదాలు పక్కనబెట్టకపోతే తానే నిర్ణయం తీసుకుంటాని కాస్త కఠిన స్వరంతోనే హెచ్చరించారట.టీడీపీ పొత్తులకు వెళితే ఇక్కడ జనసేన ఓటింగ్ కీలకంగా మారుతుంది. ఇప్పుడు ఎన్నికలను ఫేస్ చెయ్యాలంటే సొంతపార్టీని.. జనసేనలో ఉన్న నాయకత్వాన్ని ప్రసన్నం చేసుకోక తప్పదు. దీంతో ఇగోల కంటే గెలవడమే ముఖ్యమని భావిస్తున్న అనిత తాను పూర్తిగా మారిన మనిషినని సన్నిహితుల దగ్గర చెప్పుకుంటున్నారట. మరి ఈ మార్పు అనితకు కలిసి వస్తుందో లేదో చూడాలి.


# ఆ గ్రామం... రోల్ మోడల్

గుంటూరు, ఆగస్టు 17, గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందనేది ఇప్పటికే అందరూ చెప్పిన వాదన. అయితే స్వచ్ఛ భారత్ దిశగా భారతవాణి అడుగులు వేయాలని మహాత్మాగాంధీ ఆనాడే అన్నారు. అయితే మహాత్మాగాంధీ కలను సాకారం చేసే దిశగా అడుగులు వేస్తున్నారు ఓ గ్రామస్థులు.. ఏపీలోని బాపట్ల జిల్లాలో గల గొనసపూడిని స్వచ్ఛ గ్రామంగా నిలపాలని కంకణం కట్టుకున్న గ్రామ పెద్దలు ఊరి చుట్టూ 60 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఆరు బయట మలవిసర్జనను నిర్మూలించారు. పారిశుద్ధ్యం విషయంలో నిర్లక్ష్యం వద్దని గ్రామస్థులకు హితబోధ చేశారు. నిత్యం పర్యవేక్షిస్తూ 650 ఇళ్లున్న ఈ చిన్న ఊరిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దే పనిలో పడ్డారు. 2,500 మంది నివసించే గొనసపూడిని స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దాలని నిర్ణయించే నాటికి గ్రామంలో 580 ఇళ్లలో మాత్రమే మరుగుదొడ్లు ఉండేవి. మిగతా వారు ఆరు బయట మలమూత్ర విసర్జన చేసేవారు.దీనిని పూర్తిగా నిర్మూలించాలని నిర్ణయించిన పెద్దలు, సర్పంచ్ దీప్తి భర్త, పారిశ్రామికవేత్త విక్రం నారాయణరావు పక్కా ప్రణాళిక రూపొందించారు. ఈ క్రమంలో మరుగుదొడ్లు నిర్మించుకునే స్తోమత లేని 25 మందికి రూ. 15 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. స్థలం లేని వారికి, విద్యార్థులకు, ఉపాధ్యాయుల కోసం ప్రాథమిక, అప్పర్ ప్రైమరీ పాఠశాల్లో 9 మరుగుదొడ్లు నిర్మించి తాళం చెవులను వారికే అందించారు. అలాగే, సచివాలయ సిబ్బంది, పాలకవర్గం, అక్కడికొచ్చే ప్రజల కోసం దాదాపు రూ. 2 లక్షలతో ఆధునిక మరుగుదొడ్లను నిర్మించారు. ఇందుకు అవసరమైన నిధుల్లో దాదాపు రూ. 7 లక్షలు నారాయణరావు అందించారు. గ్రామాన్ని స్వచ్ఛంగా తీర్చిద్దాలని కలలగన్నప్పటికీ కొందరు గ్రామస్థులు ఇంకా ఆరుబయటే మలమూత్ర విసర్జన చేస్తుండడంతో వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసుకుంటున్న గ్రామ యువకులను పిలిపించి వారిని ప్రతి ఇంటికి పంపి అవగాహన కల్పించారు. అంతేకాదు, ఇకపై బహిరంగ మలవిసర్జనకు రూ. 500 జరిమానా చెల్లించుకోవాల్సి వస్తుందని నిబంధన పెట్టారు. కరపత్రాలు ముద్రించి ప్రచారం చేశారు.ఇలాంటి వారిపై నిఘా పెట్టేందుకు రూ. 6 లక్షలు ఖర్చు చేసి గ్రామం చుట్టూ 60 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో బయట మలవిసర్జనకు వెళ్తూ 25 మంది సీసీ కెమెరాలకు చిక్కారు. వీరి నుంచి జరిమానా వసూలు చేశారు. చెంబులు, నీళ్ల డబ్బాలతో బయట కనిపించే వారిని డబ్బారాయుళ్లుగా మైకుల్లో ప్రచారం చేస్తుండడంతో బయట మలవిసర్జనను మానేశారు. మద్యం తాగడం కూడా తగ్గింది. ఈ ఏడాది గాంధీ జయంతి నాటికి 100 శాతం బహిరంగ మలమూత్ర విసర్జనను నిర్మూలిస్తామని నారాయణరావు చెప్పారు.

# పాణ్యంలో పోటాపోటీ ప్రదర్శనలు

కర్నూలు, ఆగస్టు 17,ఒకే ప్రాంతం, ఒకే ఊరువారు రాజకీయంగా ఎంతో ఎదిగినవారు ఒకే నియోజకవర్గాన్ని చేజిక్కించుకోవడంలో పోటాపోటీగా తమ సత్తాను ప్రదర్శిస్తున్నవారు బైరెడ్డిరాజశేఖర్ రెడ్డి, గౌరు వెంకటరెడ్డి. ఇరువురూ నంద్యాల జిల్లా నందికొట్కూరుకు చెందినవారే. తండ్రి వారసత్వ రాజకీయంతో బైరెడ్డి పొలిటికల్ ఎంట్రీ ఇస్తే కాంగ్రెస్సీనియర్ నేత మద్దూరు సుబ్బా రెడ్డి పిలుపుతో గౌరు వెంకట రెడ్డి రాజకీయ ఆరంగ్రేటం చేశారు. 1994, 1999లో బైరెడ్డి నందికొట్కూరు టీడీపీ ఎమ్మెల్యేగా పని చేశారు. ఇక.. గౌరు వెంకటరెడ్డి సతీమణి గౌరు చరితారెడ్డి 2004 ఎన్నికల్లో బైరెడ్డిని ఓడించి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఆ కుటుంబాల మధ్య రాజకీయం రసవత్తరంగా సాగింది. 2009 ఎన్నికల సమయంలో నియోజకవర్గాల పునర్వి భజనలో భాగంగా నందికొట్కూరు జనరల్ నుంచి ఎస్సీ రిజర్వుడుగా మారింది. ఈ కారణంగా బైరెడ్డి, గౌరు రెడ్డి కుటుంబాలు తమ నియోజకవర్గాన్ని పాణ్యానికి మార్చాయి. అక్కడా నువ్వా నేనా అన్నంతా రాజకీయాలు నడిచాయి. 2019 ఎన్నికల ముందు తెలుగుదేశం అధినేత చంద్రబాబు వారిద్దరిని ఒకటి చేశారు. ఫలితంగా ఆ ఎన్నికల్లో గౌరు బావ మాండ్ర శివానంద రెడ్డి నంద్యాల టీడీపీ అభ్యర్థిగా పోటీచేసినపుడు ఇద్దరూ ఆయనకు మద్దతునిచ్చి ప్రచారం చేశారు. కానీ దురదృష్టవశాత్తూ ఆయన ఓడిపోయారు. ఎన్నికల తర్వాత ఏపీ రాజకీయాల్లో తలెత్తిన పరిస్థితులతో బైరెడ్డి, ఆయన కూతురు శబరి బీజేపీలో చేరారు. అటు.. 2019 ఎన్ని కల్లో పాణ్యం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన గౌరు చరితారెడ్డి ఓడిపోయారు. ఓటమి చెందినప్పటికీ గౌరు ఫ్యామిలీ టీడీపీలోనే కొనసాగుతున్నారు. మూడేళ్ల నుంచి బైరెడ్డి, గౌరు.. ఎవరి పార్టీ కార్యక్రమాల్లో వారు బిజీబిజీగా ఉన్నారు. అయితే.. ఇటీవల పిన్నాపురంలో నెలకొన్న సమస్యలపై బైరెడ్డి సీరియస్‌గా స్పందించారు. గ్రీన్ కో కంపెనీ నిర్మించే పవర్ ప్రాజెక్టులతో పిన్నాపురానికి ఇబ్బందులు తలెత్తుతాయని, ముఖ్యంగా.. రిజర్వాయర్ ఆనకట్ట గ్రామానికి అతి సమీపంలో ఉండడంతో ముప్పు వాటిల్లే అవకాశం ఉందని బైరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. గ్రీన్ కో ప్రాజెక్టుపై గ్రామస్తులు ఆందోళన చేస్తుంటే.. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాం భూపాల్‌రెడ్డి నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా ఉన్న గౌరు వెంకటరెడ్డి ఆ కంపెనీ తో తలెత్తే సమ స్యలను నిర్లక్ష్యం చేశారని బైరెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ప్రజల తరుపున పోరాడాల్సిన ప్రతిపక్ష నేతలు పోలీసుల చేత ముందే హౌస్ అరెస్టులు చేయించుకుని. ఆందోళనలు చేస్తున్నట్లు నటిస్తున్నారని బైరెడ్డి విమర్శించారు. ఇదిలా ఉండగా, బైరెడ్డి చేసిన వ్యాఖ్యలపై గౌరు గట్టిగానే సమాధానం చెప్పారు. రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి ఎవరెంత సంపాదించుకున్నారో చర్చించుకుందామని.. బైరెడ్డికి సవాల్ విసిరారు. పాణ్యంలోని పరిశ్రమల యజమానులు, కాంట్రాక్టర్ల నుంచి కమిషన్లు తీసుకున్నట్లు ఆధారాలతో సహా నిరూపించాలని డిమాండ్ చేశారు.

# తొలి బహుజన విప్లవ వీరుడు ...



తొలి బహుజన విప్లవ వీరుడు ...తెలంగాణా శివాజీ మన సర్దార్ సర్వాయి పాపన్న వరంగల్ జిల్లా జనగాం దగ్గర కైలాస్ పూర్ గ్రామంలో గౌడ కులంలో 1650 లో జన్మించారు, తండ్రి చిన్న తనం లోనే చనిపోయారు, సర్వమ్మ అతడి తల్లి, పాపడు అని అతన్ని పిలిచేవారు.పాపన్న ఎల్లమ్మకు పరమ భక్తుడు, అతను శివున్ని ఆరాధించేవాడు, తల్లి కోరిక మేరకు గౌడ వృత్తిని స్వీకరించాడు, కాని అతని మనసులో మాత్రం తెలంగాణా లో అంతకంతకు పెరుగుతున్న ముస్లింల ఆధిపత్యాన్ని అంతం చెయ్యాలని ఉండేది, అందుకోసం అతను గెరిల్ల సైన్యాన్ని తాయారు చేసాడు, ఆ సైన్యం ద్వారా మొగలు సైన్యం పై దాడి చేసే వాడు,1675 లో సర్వాయి పేట లో తన రాజ్యాన్ని స్థాపించాడు, తన సొంత ఊరు కైలాస్ పూర్ రాజధాని. ఇతను శివాజీకి సమకాలికుడు, శివాజీ ముస్లింల పాలనా అంతానికి మహారాష్ట్రలో ఎలాగైతే పోరాడాడో, పాపన్న కూడా తెలంగాణాలో ముస్లింల పాలనా అంతానికి పోరాడాడు, 1687 - 1724 వరకు అప్పటి మొగల్ చక్రవర్తి ఔరంగాజేబ్ సైన్యానికి వ్యతిరేకంగా పోరాడాడు, పాపన్న ఒక్కో ప్రాంతాన్ని ఆక్రమించి విజయ దుర్గాలు నిర్మించాడు, 1678 వరకు తాటికొండ, వేములకొండాలను తన ఆధీనం లోకి తెచ్చుకొని

**తెలంగాణా శివాజీ సర్వాయి పాపన్న**

**నేడు అయన జయంతి. ఘనంగా నివాళులు అర్పిద్దాం**

దుర్గాలను నిర్మించాడు, 1700 - 1705 మధ్య కలం లో షా పుర లో మరొక దుర్గం నిర్మించాడు, అతని సామ్రాజ్యం తాటికొండ, కొలనుపాక, చేర్యాల నుండి కరీం నగర్ జిల్లా లోని హుసనాబాద్, హుజురా బాద్ విస్తరించింది, భువనగిరి కోటను రాజధానిగా చేసుకొని అతను ముప్పై సంవత్సరాలు పరిపాలించాడు.
పాపన్నఒక సాధారణ గౌడ కుటుంబం నుండి వచ్చిన వాడు కనుక అతనికి ప్రజల కష్ట నష్టలన్నీ తెలుసు, అందుకే పాపన్న రాజ్యంలో పన్నులు లేవు, ఖజానా కొరకు అతను జమిందార్, సుబేదార్ లపై తన గెరిల్ల సైన్యంతో దాడి చేయించేవాడు, పాపన్న అనేక ప్రజామోద యోగ్యమైన పనులు చేసాడు, అతని రాజ్యం లో సామజిక న్యాయం పాటించేవాడు, తాటి కొండలో చెక్ డాం నిర్మించాడు, అతను ఎల్లమ్మకు పరమ భక్తుడు కావున హుజురాబాద్ లో ఎల్లమ్మ గుడి కట్టించాడు, అది నేటికి రూపం మారిన అలానే ఉంది.
పాపన్న గెరిల్ల సైన్యం తో మొగల్ సైన్యం పై దాడి చేస్తున్నాడని ఔరంగజేబ్ కు తెలిసింది, అతడు రుస్తుం దిల్ ఖాన్ కు భాద్యతలు అప్పగించాడు, రుస్తుం దిల్ ఖాన్ యుద్దానికి ఖాసిం ఖాన్ ను పంపించాడు, శఃపుర వద్ద ఇరు సైన్యాలు తలపడ్డాయి, నెలలపాటు యుద్ధం జరిగింది, చివరికి రుస్తుం దిల్ ఖాన్ రంగం లోకి దిగాడు, సుమారు 3 నెలలపాటు యుద్ధం జరిగింది, పాపన్న తన ప్రాణ స్నేహితున్ని కోల్పోయాడు, దాంతో ఆయన యుద్దాన్ని విరమించుకున్నాడు, అతను అజ్ఞాతంలోకి వెళ్ళిపోయాడు, మొగల్ సైన్యాలు అతని కోసం వెతకడం ప్రారంభించాయి, అయితే పాపన్న తన సొంత ఊరు జనగామ కు వెళ్లి అక్కడ గౌడ కులం వారు ఎక్కువగా ఉండే చోట జీవితం గడిపాడు, ఔరంగజేబ్ మరణించిన తర్వాత దక్కన్ పాలకుడు కంబక్ష్ ఖాన్ బలహీన పాలనను చుసిన పాపన్న 1 ఏప్రిల్ 1708 లో వరంగల్ కోటపై దాడి చేసాడు, అయితే ఈ దాడిలో పాపన్న పట్టుబడ్డాడు.
1708 లో గోల్కొండకు తీసుకెళ్ళి పాపన్న తల తీసి కోట ముఖ ద్వారానికి వెల్లడ దీసారు.

# మళ్లీ ఉద్యోగుల మిలియన్ మార్చ్

ఏలూరు, ఆగస్టు 17, ఆంధ్రప్రదేశ్‌లో ఓ మిలియన్ మార్చ్ జరగబోతోంది. సెప్టెంబర్ ఒకటో తేదీన సీపీఎస్ ఉద్యోగులు. టీచర్లు ఈ మిలియన్ మార్చ్ చేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన వారంలో సీపీఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చిన జగన్.అందుకు భిన్నంగా అవగాహన లేకుండా లేకుండా హామీ ఇచ్చానని చెబుతున్నారు.దీంతో ప్రభుత్వంపై పోరుబాటే శరణ్యమని ఉద్యోగులు నిర్ణయించుకున్నారు. ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహంతో ఉన్న సీపీఎస్ ఉద్యోగులు, మరీ సెప్టెంబర్ ఒకటో తేదీన మిలియన్ మార్చ్ నిర్వహించి ప్రభుత్వంపై తమ వ్యతిరేకతను గట్టిగా తెలియజేయాలని నిర్ణయించుకున్నారు. అయితే సహజంగానే టీచర్ల నిరసనకు ప్రభుత్వ అనుమతి ఇచ్చే అవకాశాలు ఎంత మాత్రం ఉండవు. కానీ ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదని టీచర్లు తమ నిరసనను ఆపే అవకాశాలూ లేవుగతంలో చలో విజయవాడను నిరోధించడానికి ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు వివఫలమైన సంగతి తెలిసిందే. పీఆర్సీ విషయంలో తమను మోసం చేసిందని ఉద్యోగులు తీ ఆగ్రహంతో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఉద్యోగులు సెప్పెంబర్ 1న మిలియన్ మార్చ్ కోసం రోడ్డెక్కితే పరిస్థితి తీవ్రంగా మారుతుందన్నఆందోళన ప్రభుత్వంలో వ్యక్తమౌతోంది. ఒక వేళ ఉద్యోగుల మిలియన్ మార్చ్ విజయవంతమైతే ప్రభుత్వ తీరు పట్ల అసంతృప్తిగా ఉన్న అన్ని వర్గాలూ పోరుబాట పట్టే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది.అందుకే సెప్టెంబర్ మిలియన్ మార్చ్ ను నిర్వీర్యం చేయాలన్న పట్టుదలతో ఏపీ సర్కార్ ఉంది. అటు ఉద్యోగులు, ఇటు ప్రభుత్వం కూడా పట్టుదలలకు పోతుండటంతో మిలియన్ మార్చ్ సందర్భంగా శాంతి భద్రతల పరిస్థితికి విఘాతం కలిగే అవకాశాలు ఉన్నాయన్న ఆందోళన సర్వత్రా వ్యక్తం అవుతోంది.

# వైసీపీ,టీడీపీ నేతల మధ్య వదల బొమ్మాళి

అనంతపురం, ఆగస్టు 17, రాప్తాడు రాజకీయాల్లో సీమ టపాకాయలు పేలుతున్నాయ్. వేరొకరి భుజంపై తుపాకీ పెట్టి కాల్చేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు నాయకులు. వదల బొమ్మాళి అని టీడీపీ నేతలు వార్నింగ్ ఇస్తుంటే.. గన్‌మెన్ లేకుండా బయటకు రండి చూద్దామని అధికారపార్టీ నాయకులు కవ్విస్తున్నారు. ఎందుకిలా? నేతలకు ఏమైంది?నిత్యం వివాదాలు, సంచలనాలకు కేంద్రంగా నిలిచే రాప్తాడులో సరికొత్త రాజకీయాలు కనిపిస్తున్నాయి. పరిటాల కుటుంబానికి, ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఫ్యామిలీకి దశాబ్దన్నర కాలంగా వైరం సాగుతోంది. పాత కక్షలు పెద్దగా లేకపోయినా రాజకీయ సవాళ్లు మాత్రం పీక్స్‌లో ఉన్నాయి. గత 15ఏళ్ల పోరాటం తర్వాత 2019 ఎన్నికల్లో ప్రకాష్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచారు. పరిటాల కోటలో పాగా వేశారు. అయితే ఎన్నికల తర్వాత సీన్ మారిపోయింది. ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డిని కాకుండా అధికారులను, పోలీసులను ఎక్కువగా టార్గెట్ చేస్తున్నారు పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్. విపక్షంలో ఉన్నప్పుడు ప్రకాష్‌రెడ్డి సైతం ఇదే విధంగా చిందులు తొక్కడాన్ని ఇక్కడి జనం గుర్తు చేసుకుంటున్నారు. కాకపోతే అధికారుల భుజంపై తుపాకులు పెట్టి రెండు వర్గాలు కాల్చుకోవడమే తాజా రాజకీయం.అధికారంలో ఉన్న పార్టీకి ఆఫీసర్లు మొగ్గు చూపడం సహజం. కానీ.. కొందరు అధికారులు ఇప్పటికీ పరిటాల కుటుంబానికి అనుకూలంగా ఉన్నారని ప్రకాష్‌రెడ్డి అనుమానిస్తున్నారట. ఈ విషయంలో ఎమ్మెల్యేకు ఉన్న సమాచారం ఏంటో కానీ.. తమ వాళ్లను ఇబ్బంది పెడుతున్న వాళ్లకు మాత్రం పరిటాల శ్రీరామ్ వార్నింగ్ ఇస్తున్నారు. వచ్చేది టీడీపీ ప్రభుత్వమని.. పవర్‌లోకి రాగానే తోక జాడించిన వాళ్లపై క్రిమినల్ చర్యలు తప్పబోవని హెచ్చరిస్తున్నారట. దీంతో రాప్తాడు రాజకీయం మరో మలుపు తీసుకుంది. ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి సీన్‌లోకి ఎంట్రీ ఇచ్చారు. సీమ భాషలో పరిటాల సునీత, శ్రీరామ్‌లకు కౌంటర్లు వేశారు. వార్నింగ్‌లు కాదు.. దమ్ముంటే గన్‌మెన్ లేకుండా బయటకు రావాలని సవాల్ కూడా చేశారు ప్రకాష్‌రెడ్డి. అక్కడితో ఆగకుండా మేము కాపాడుకుంటోన్న ప్రాణాలు మీరు.. అందుకే గన్‌మెన్ ఇచ్చాం.. ఎక్కడికైనా తిరిగే స్వేచ్ఛనిచ్చాం.. అని ఎమ్మెల్యే సెటర్లు వేశారు.ప్రకాష్‌రెడ్డి కామెంట్స్ కాంట్రవర్సీగా మారడంతో రాప్తాడులో రాజకీయం వేడెక్కింది. అధికారులు.. పోలీసుల తీరుపై చేస్తున్న విమర్శలు కాస్తా.. రెండు పార్టీల నేతల మధ్య మాటల తూటాలకు దారితీయడంతో వైసీపీ, టీడీపీ శిబిరాలు అలర్ట్ అయ్యాయి. ఎన్నికల వరకు ఇదే వేడి కొనసాగించే ఎత్తుగడలు వేస్తున్నారట. మరి.. సీమ టపాకాయలు రాప్తాడులో ఎలాంటి సౌండ్ చేస్తాయో చూడాలి.

# దసరా కోట రెడీ అవుతోంది

తిరుమల ఆగస్టు 17 తిరుమల శ్రీవారి భక్తులకు టీటీడీ తీపికబురు అందించింది. అక్టోబర్ నెలకు సంబంధించిన రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లను ఆగస్టు 18వ తేదీ ఉదయం 9 గంటలకు విడుదల చేయనున్నట్లు టీటీడీ వెల్లడించింది. వార్షిక బ్రహ్మోత్సవాలు జరిగే రోజులు మినహా మిగతా అన్ని రోజుల టికెట్లను విడుదల చేయనున్నట్లు ప్రకటనలో తెలిపింది. అక్టోబర్ నెలలో శ్రీవారిని దర్శించుకోవాలనుకునే భక్తులు బితితీబీజూజీబితిఎజీశ్రీజీతీతి.జీజూ.ఔనీల.తిని వెబ్‌సైట్ ద్వారా దర్శన టికెట్లు బుక్ చేసుకోవాలని టీటీడీ అధికారులు సూచించారు.అటు ఈనెల 18న టీటీడీ వాచీల ఈ-వేలం నిర్వహించనుంది. తిరుమల శ్రీవారి ఆలయంతోపాటు, ఇతర అనుబంధ ఆలయాలలో హుండీ ద్వారా భక్తులు కానుకగా సమర్పించిన వాచీలను ఈ-వేలంలో అందుబాటులో ఉంచుతారు. రాష్ట్ర ప్రభుత్వ కొనుగోలు పోర్టల్ ద్వారా 18న వాచీల ఈ-వేలం నిర్వహించనున్నామని, భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని టీటీడీ అధికారులు తెలిపారు. ఈ వేలంలో సీకో, హెచ్‌ఎంటీ, టైటాన్, సోనీ, క్యాషియో, టైమెక్స్, ఆల్విన్, సొనాటా, టైమ్‌వెల్, ఫాస్ట్‌ట్రాక్, సిటిజన్, రొలెక్స్‌తోపాటు ఇతర కంపెనీల వాచీలు ఉంటాయి. కొత్తవి, ఉపయోగించినవి, పాక్షికంగా పాడైన వాచీలు.. ఇలా వివిధ కేటగిరీలుగా వాచీలను భక్తులకు అందుబాటులోకి ఉంచుతారు.

నగదు రహిత సేవలు

టీటీడీ పాలక మండలి సేవలపై టిటిడి ఈవో ధర్మారెడ్డి కీలక ప్రకటన చేశారు. నిరంతరంగా ధార్మిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తామని.. మొదటి విడతగా తెలుగు రాష్ట్రాలలో 502 శ్రీవారి ఆలయాలు నిర్మించామన్నారు టిటిడి ఈవో ధర్మారెడ్డి. రెండో విడతగా 1130 ఆలయాల నిర్మాణం, జీర్ణోద్ధరణ పనులు జరుగుతున్నాయని.. విశాఖపట్నం, భువనేశ్వర్, అమరావతిలో శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయాలను ప్రారంభించామని స్పష్టం చేశారు.రూ.23 కోట్లతో నూతన పరకామణి భవనం త్వరలో అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. టిటిడి ఉద్యోగులకు నగదు రహిత వైద్యసేవలు నిర్వహిస్తామని.. తిరుమలలో పూర్తి స్థాయిలో ప్లాస్టిక్ నిషేధం అని తేల్చి చెప్పారు. టిటిడిలో 7,260 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించామని.. బర్డ్ ఆసుపత్రిలో సెరిబ్రల్ పాల్సీ పిల్లలకు ప్రత్యేక వైద్యం అందిస్తామన్నారు. శ్రీపద్మావతి చిన్న పిల్లల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని రెండేళ్లలో పూర్తి చేస్తామని ప్రకటన చేశారు టిటిడి ఈవో ధర్మారెడ్డి.

# మూడు వర్గాలే డిసైడింగ్ ఫ్యాక్టర్

విజయవాడ, ఆగస్టు 17, వైసీపీ అధినేత జగన్ కు ముఖ్యమంత్రిగా పదవీ కాలం ఇంకా రెండేళ్లు ఉంది. 2024లో శాసనసభ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో మరోసారి గెలిచి తీరాలన్న పట్టుదలతో జగన్ ఉన్నారు. ఒక్క ఛాన్స్ అంటూ వచ్చిన జగన్ కు రెండో ఛాన్స్ ఇస్తారా? లేదా? అన్నది ఏపీ రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత రెండేళ్లు కరోనాతో సమయం సరిపోయింది. ఆయన ముఖ్యమంత్రిగా పెద్దగా ప్రజల్లోకి వెళ్లలేకపోయారు. ఇప్పుడిప్పుడే ప్రభుత్వ కార్యక్రమాలతో జగన్ కు చేరువయ్యే ప్రయత్నం చేస్తున్నారు. ఆయన అధికారంలోకి వచ్చిన తర్వాత వరసగా వరదలు రావడం మొదలెట్టాయి. పంటలు పూర్తిగా నష్టపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. రైతాంగానికి వరద నష్టపరిహారం చెల్లించడంలో ప్రభుత్వం విఫలమయిందన్న విమర్శలు జగన్ ఎదుర్కొన్నారు. విద్య, వైద్యం పైనే ఈ మూడేళ్లు జగన్ ఎక్కువ దృష్టి పెట్టారు. మిగిలిన శాఖలను విస్మరించారన్న ఆరోపణలు అయితే వినిపిస్తున్నాయి. అయితే కరోనా సమయంలోనూ పేద ప్రజలకు సంక్షేమ పథకాలను నిలుపుదల చేయకుండా అందరికీ అందజేయడం కొంత అనుకూలంగానే కనిపిస్తున్నా మధ్యతరగతి, ఉన్నత వర్గాల్లో మాత్రం వ్యతిరేకత నెలకొందన్న అభిప్రాయం నెలకొంది. ఎక్కువ శాతం పోలింగ్ జరిగితే జగన్ నష్టపోతారన్నది రాజకీయ విశ్లేషకుల నుంచి వినిపిస్తుంది. పోలింగ్ లో ఉన్నత స్థాయి వర్గాలు, మధ్య తరగతి ప్రజలు దూరంగా ఉంటారన్నది ఎంతకాలం నుంచో చూస్తున్నాం. కేవలం పేద వర్గాలే పోలింగ్ లో విరివిగా పాల్గొంటాయి. ఆ రెండు వర్గాలు పోలింగ్ కు దూరమయితే అది జగన్ కు లాభమవుతుంది. వారు ఎక్కువగా పోలింగ్ లో పాల్గొంటే జగన్ కు నష్టం జరుగుతుందన్న అంచనాలు వినిపిస్తున్నాయి. అయితే ఇందులో వాస్తవం లేకపోలేదు. జగన్ అభివృద్ధిని పక్కన పెట్టి పేదలకు నిధులను పంచిపెట్టడమే పనిగా పెట్టుకున్నారని ఆ రెండు వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఇటీవల రెండు జాతీయ మీడియా సంస్థలు జరిపిన సర్వేలోనూ జగన్ పార్టీకే ఎక్కువ పార్లమెంటు స్థానాలు వస్తాయని తేలింది. అయితే సర్వేలో కూడా ఎక్కువ మంది పేద ప్రజలే పాల్గొన్నారన్నది విపక్ష నేతల మాట. మధ్య, ఉన్నత వర్గాలే కాకుండా జగన్ ప్రభుత్వం పట్ల న్యూట్రల్ ఓట్లు వ్యతిరేకంగా ఉన్నారని, న్యూట్రల్ ఓట్లు ఎవరికి ఎక్కువ పడితే వారిదే అధికారమని ప్రధాన ప్రతిపక్షం టీడీపీ భావిస్తుంది. అందుకే టీడీపీ ఆ మూడు వర్గాలపై కన్నేసింది. జగన్ మాత్రం మరో రెండేళ్లు కూడా కేవలం తాను అనుకున్న ప్రకారమే ముందుకు వెళితే రాజకీయంగా కొంత ఇబ్బందులు తప్పవన్న కామెంట్స్ వినపడుతున్నాయి. మొత్తం మీద పోలింగ్ శాతాన్ని బట్టి వచ్చే ఎన్నికల్లో జగన్ భవితవ్యం ఆధారపడి ఉంటుందన్నది వాస్తవం.

# మృతదేహం విషయంలో ఇరుగ్రామాల మధ్య ఉద్రిక్తత

పార్వతీపురంపార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలం కొత్త కల్లికోట గ్రామంలో లో విషాదకర ఘటన జరిగింది. తమ గ్రామంలో మృతి చెందిన వృద్ధురాలి మృతదేహాన్ని స్మశానానికి తరలిస్తుండగా పాత కల్లికోట గ్రామస్తులు అడ్డుకున్నారు. కొత్త కల్లికోట గ్రామ స్మశానవాటికలో నాగావళి వరద నీరు చేరడంతో మృతదేహాన్ని బంధువులు, గ్రామస్థులు పాత కల్లికోటకు తరలించారు. వారిని పాత కల్లికోట గ్రామస్తులు తమ గ్రామంలో దహన సంస్కారాలు చేసేందుకు వీల్లేదు అంటూ అడ్డుకున్నారు. దాంతో ఇరు గ్రామాల మధ్య ఉద్రిక్తత నెలకొంది. ఇరు వర్గాలు తోసుకున్నారు. చివరికి , అధికారుల చొరవతో వివాదం సద్దుమణిగింది. అధికారుల సమక్షంలో పాత కల్లికోట గ్రామంలో దహన సంస్కారం నిర్వహించారు.

# లంకవాసులకు విషసర్పాల ముప్పు

అల్లూరి సీతారామరాజుజిల్లాలోని విఆర్ పురం, కూనవరం మండలాల్లోని లంక వాసులు విషసర్పాల కాటుకు బలవుతున్నారు. మరోవైపు, గోదావరి వరదలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. రాత్రి వేళ చిమ్మ చీకట్లో అటవీ ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకున్న గుడారాల్లో విష సర్పాల కాటుకు గురవుతున్నారు. వరదలతో విలీన మండలాల వాసుల ఇళ్ళు నీట మునగడంతో బాధితులు పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్నారు. పలుచోట్ల అడవుల్లోనే గుడారాలు వేసుకుని ఉంటున్నారు. పురామచంద్రపురం మండలంలోని అడవి వెంకన్నగూడెం ముంపునకు గురి కావడంతో ఆ గ్రామస్తులు సమీపంలోని అడవిలో గుడారాలు వేసుకొని ఉంటున్నారు. ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజామున గ్రామానికి చెందిన సుబ్బయ్య (45) పాము కాటుకు గురయ్యారు. గ్రామానికి అన్ని వైపుల వరద ఉండటంతో ఆసుపత్రికి వెళ్లేందుకు అవకాశం లేకపోవటంతో స్థానికులు పడవ కోసం ప్రయత్నించగా సకాలంలో అది రాలేదు. దీంతో వైద్యం అందక బాధితుడు మృతి చెందాడు. కూనవరం మండలంలోని కోతల గుట్ట పునరావాస కేంద్రంలో ఉంటున్న కూనవరానికి చెందిన సంపతి రమణయ్య సోమవారం వరద తగ్గడంతో ఇల్లు కడిగేందుకు ఉదయ భాస్కర్ కాలనీకి వెళ్లారు. ఇంట్లోని బిందెను పట్టుకోగా అందులో ఉన్న పాము కాటేసింది. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు ఏరియా ఆసుపత్రికి తరలించారు.

# సీజనల్ వ్యాధుల నియంత్రణకు కార్యచరణ

గడివేముల గ్రామాలలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నట్లు డిప్యూటీ డి ఎం హెచ్ ఓ జగదీశ్వర్ రెడ్డి తెలిపారు. ఆయన గడివేముల ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య సిబ్బంది. ఏఎన్ఎం ఆశ వర్కర్ల తో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాలలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని చేపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సచివాలయం పరిధిలో డాక్టర్ ,ఆరోగ్య సిబ్బంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఓపి నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం వైద్యులు సచివాలయం పరిధిలో ఉన్న పాఠశాలలో అంగన్వాడీ కేంద్రాలలో ఉన్న విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారని అన్నారు. పోషకాహార లోపం అనారోగ్యం బారిన పడిన పిల్లలను గుర్తించి వారికి మెరుగైన వైద్యం సేవలను అందిస్తారన్నారు. సీజనల్ వ్యాధులలైన డెంగ్యూ, మలేరియా, గ్రామాల్లో చర్యలు చేపట్టాలని అన్నారు. పరిశుద్ధం పై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. వైద్యులు సృజన, ఎంపిహెచ్ఈవో మహేశ్వర్ రెడ్డి, సూపర్వైజర్ వేణుగోపాల్ రెడ్డి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# వైసీపీకి తలనొప్పిగా మారిన న్యూడ్ వీడియో

విజయవాడ, ఆగస్టు 17, దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన వైసీపీ ఎంపీ న్యూడ్ వీడియో కాల్ వ్యవహారంపై దర్యాప్తునకు సీబీఐ రంగంలోనికి దిగనుందా? జరుగుతున్న పరిణామాలను గమనిస్తుంటే అలాగే జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయని పరిశీలకులు అంటున్నారు. గోరంట్ల న్యూడ్ వీడియో కాల్ వ్యవహారంపై జాతీయ రాజకీయాలలో కూడా దుమారం రేగుతోంది. గోరంట్ల మాధవ్ ఆ వీడియోలో ఉన్నది తాను కాదని అంటున్నారు.అది ఫేక్ వీడియో అనీ, తనను బదనాం చేయడానికి కుట్ర పూరితంగా ఫేక్ వీడియోను సృష్టించారనీ ఆరోపిస్తున్నారు. బీసీ కార్డును వాడుకుంటూ.. ఇక బీసీనీ అయిన తనను రాజకీయంగా సమాధి చేయాలన్న తెలుగుదేశం కుట్రలో భాగమే ఈ వీడియో అని ఆరోపిస్తున్నారు. మరో వైపు అనంతపురం ఎస్పీ ఫకీరప్ప ఎటువంటి ఫోరెన్సిక్ పరీక్షలూ లేకుండానే గోరంట్ల న్యూడ్ వీడియో ఫేక్ అని సర్టిఫికేట్ (తీర్పు) ఇచ్చేశారు. అదే సమయంలోఏపీలో రచ్చగా ఉన్న వైసీపీ ఎంపీ గోరంట్ల మాధవ్ న్యూడ్ వీడియో రాజకీయాల్లో దుమారమే రేపుతోంది. ఈ న్యూడ్ వీడియో తనది కాదు ఇది ఫేక్ అని ఎంపీ గారు అంటున్నారు.తనను బదనాం చేస్తున్నారు అని ఆయన ఆరోపిస్తున్నారు. కొందరు కలసి బీసీనైన తనను రాజకీయంగా హత్య చేయాలని చూస్తున్నారు అని ఆయన మండిపడ్డారు.ఇలా ఉండగా తెలుగుదేశం పార్టీ నాయకుడు పట్టాభి అమెరికా ఫోరెన్సిక్ ల్యాబ్ లో చేసిన టెస్టులలో ఈ వీడియో ఒరిజినల్ అని తేలింది అంటూ మాధవ్ పై చర్యకు డిమాండ్ చేశారు. కాగా ఈ న్యూడ్ వీడియో కాల్ వ్యవహారంపై జాతీయ స్థాయిలో చర్చ సాగుతోంది. పంజాబ్ కి చెందిన కాంగ్రెస్ ఎంపీ లోక్ సభ స్పీకర్ కి లేఖ రాసి ఎంపీ మీద చర్యలు తీసుకోవాలని కోరారు. ఇంకో వైపు జాతీయ మహిళా కమిషన్ కూడా దీని మీద పూర్తి విచారణ చేయాలని ఏపీ డీజీపీని కోరింది.ఏపీ హై కోర్టు న్యాయవాది లక్ష్మీనారాయణ మాధవ్ ది అని భావిస్తున్న వీడియోపై సీబీఐకి ఫిర్యాదు చేశారు. ఈ వీడియో మీద దర్యాప్తు జరపాలని ఆ లేఖలో కోరారు. అలాగే మాధవ్ మీడియా ముందు చేసిన కామెంట్స్ వల్ల కులాల మధ్య చిచ్చు పెట్టేలా ఉందంటూ ఆ వీడియో బైట్స్ ని కూడా సీబీఐకి పంపించారు.ఆయన తన ఫిర్యాదుని ఈ మెయిల్ ద్వారా చెన్నై లో ఉన్న సీబీఐ అఫీసుకు పంపించారు. మరి సీబీఐ ఈ కేసు దర్యాప్తు చేపడుతుందా అన్నది వేచి చూడాల్సిందే.

కిం కర్తవ్యం.....

గోరంట్ల మాధవ్ వీడియో ఒక పక్కన టీడీపీ- వైసీపీ మధ్య వివాదంగానే కాకుండా.. కమ్మ- కురబ కులాల మధ్య చిచ్చు రేపేలా మారింది. నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న గోరంట్ల మాధవ్.. అది తనపై కమ్మ సామాజికవర్గం చేసిన కుట్ర అంటూ అసభ్య పదజాలంతో విమర్శలు గుప్పించడం గమనార్హం. మాధవ్ చేసిన వ్యాఖ్యల్ని కమ్మ సామాజికవర్గానికి చెందిన అనేక మంది తీవ్రంగా ఖండించారు. పరుష పదజాలంతో మాధవ్ పై విరుచుకుపడ్డారు.గోరంట్ల మాధవ్ అశ్లీల వీడియో వ్యవహారాన్ని ఏపీ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ దృష్టికి మహిళా జేఏసీ నేతలు తీసుకెళ్లారు. మాధవ్ కు క్లీన్ చిట్ ఇచ్చేలా మాట్లాడిన ఫకీరప్పపై గవర్నర్ కు వారు ఫిర్యాదు చేశారు. న్యూడ్ వీడియో వ్యవహారం నుంచి బయట పడేందుకు సామాజికవర్గాన్ని మాధవ్ వాడుకుంటున్నారని ఫైరయ్యారు. మాధవ్ కు నీతి, నిజాయితీ ఉంటే.. లోక్ సభ ప్రివిలేజ్ కమిటీకి ఎందుకు ఫిర్యాదు చేయలేదని మహిళా జేఏసీ నేతలు ప్రశ్నిస్తున్నారు. మరో పక్కన కురుబ నేతలు కూడా మాధవ్ పై మండిపడుతుండడం విశేషం. కురుబలకు మాధవ్ ఒరగబెట్టిందేమీ లేకపోగా, నమ్మి ఓట్లు వేస్తే తమ ఆత్మగౌరవాన్ని మాధవ్ బజారుకీడ్చారంటూ ఫైరవుతుండడం గమనార్హం. ఈ అశ్లీల వీడియోపై అటు టీడీపీ ఇటు వైసీపీ ఎందుకు అంత సీరియస్ గా తీసుకుంటున్నాయనే చర్చ ఏపీ వ్యాప్తంగా జరుగుతోంది. ఒక మహిళతో మాధవ్ అశ్లీలంగా వీడియో మాట్లాడుతూ దొరికిపోయిన వ్యవహారం ఇప్పటికే వైసీపీ- టీడీపీ మధ్య జరుగుతున్న వార్ కు ఆజ్యం పోసినట్లయింది. మాధవ్ అశ్లీల వీడియోపై టీడీపీ ఏ మాత్రం పట్టు వీడడం లేదు. అశ్లీల వీడియోతో దొరికిపోయిన మాధవ్ ను సస్పెండ్ చేయాలని వైసీపీపై ఒత్తిడి పెంచుతూనే ఉంది. మరో పక్కన మాధవ్ వీడియోపై లోక్ సభ స్పీకర్ కు కాంగ్రెస్ ఎంపీ ఫిర్యాదు చేశారు.జాతీయ మహిళా కమిషన్ కూడా దీనిపై ఘాటుగానే స్పందించింది. టీడీపీ విమర్శల దాడి పెంచండంతో వైసీపీ నేతలు, ఆ పార్టీ ప్రభుత్వ పెద్దలు మాట మార్చేశారు. మాధవ్ పై చర్యలు తీసుకుంటే బీసీ సామాజికవర్గాలు తమకు దూరం అవుతాయనే భయం వైసీపీని వెన్నాడుతున్నట్లు చెబుతున్నారు. అదే సమయంలో మాధవ్ పై చర్యలు తీసుకునేలా జగన్ పై ఒత్తిడి పెంచి, విజయం సాధించి బీసీల మద్దతు వైసీపీకి దూరం చేయొచ్చనే వ్యూహంతో టీడీపీ ముందుకు వెళ్తున్నట్లు ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే అటు టీడీపీ ఇటు వైసీపీ కూడా మాధవ్ వీడియో వ్యవహారాన్ని సీరియస్ గానే తీసుకున్నాయంటున్నారు.

# ధవళేశ్వరం వద్ద గోదావరి ఉధృతి



రాజమండ్రి,ఆగస్ట్17: ఉపనదులు ప్రాణహిత, ఇంద్రా వతి ఉప్పొంగి ప్రవహిస్తూ గోదావరిలో కలుస్తూ ఉండటంతో గోదావరి మరలా ఉధృతమై ప్రవహిస్తోంది. ధవళేశ్వరం వద్ద మంగళవారం ఉదయం 8 గంటల వరకు తగ్గిన నీటిమట్టం 13.70 అడుగులకు చేరుకోవడంతో రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరిస్తూ ఆదేశాలు జారీ చేశారు. మధ్యాహ్నం మళ్లీ పెరగడంతో మరలా రెండో ప్రమాద హెచ్చరిక జారీ అయింది. రాత్రి 11 గంటలకు నీటిమట్టం 14.15 అడుగులకు చేరుకోగా 13.36 లక్షల క్యూసెక్కులు దిగువకు ప్రవహిస్తోంది. ధవళేశ్వరం వద్ద నీటిమట్టం 15

## ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్న అధికారులు

అడుగులకు పైగా పెరిగి 16 లక్షల క్యూసెక్కుల ప్రవాహం తరలిరావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. గత ఆరు రోజులుగా ధవళేశ్వరం వద్ద ప్రమాద హెచ్చరికలు కొన సాగుతుండగా మంగళవారం రెండో ప్రమాద హెచ్చరిక ఉపసంహరించడంతో ఫ్లడ్ సెక్షన్ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. 8 గంటల వ్యవధిలోనే మరలా రెండో ప్రమాద హెచ్చరిక జారీ కావడంతో ఈఈలు, డీఈ, ఏఈలు వారికి కేటాయించిన పరిధిలో వరద పర్యవేక్షణ అధికారులుగా విధుల్లో చేరారు. ఔట్ ఫాల్స్ స్లూయిజ్‌ల వద్ద తగు రక్షణ ఏర్పాట్లు చేస్తున్నారు. వరదనీటి మట్టం మరింత పెరగవచ్చనే అంచనాతో మరింత అప్రమత్తంగా ఉన్నారు. ఎగువన భద్రాచలం వద్ద తగ్గిన నీటిమట్టం ఆపై నిలకడగా కొనసాగి మంగళవారం తెల్లవారుజామున 48 అడుగులకు పెరగడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీచేశారు. వేగంగా పెరుగుతున్న నీటిమట్టం రాత్రి 7 గంటలకు 52.80 అడుగులకు చేరుకుంది. నీటిమట్టం 55 అడుగుల వరకు పెరగవచ్చని అంచనా వేస్తున్నారు. కాళేశ్వరం వద్ద సోమవారం సాయంత్రానికి 9.900 మీటర్లుగా ఉన్న నీటిమట్టం మంగళవారం సాయంత్రానికి ఒకటిన్నర మీటర్ల మేర పెరిగి 11.430 మీటర్లకు చేరుకోగా, పేరూరు వద్ద 13.920 మీటర్లుగా ఉన్న నీటిమట్టం 15.370 మీటర్లుకు చేరుకుంది. దుమ్ముగూడెం వద్ద 14.720 మీటర్లు, భద్రాచలం వద్ద 52.80 అడుగులు, కూనవరం వద్ద 21.490 మీటర్లు, కుంట వద్ద 12.650 మీటర్లు, పోలవరం వద్ద 13.380 మీటర్లు, రాజమహేంద్రవరం వద్ద 16.840 మీటర్లుగా నీటిమట్టం నమోదైంది.

# కలమల్ల పోలీసు స్టేషన్ ను పరిశీలించిన ఎస్పీ

కడప కడప జిల్లా లోని కొండాపురం సర్కిల్ పరిధిలోని కలమల్ల పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ శ్రీ కే.కే.ఎన్ అన్బు రాజన్ ఐ.పి.ఎస్ బుధవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పరిసరాలను పరిశీలించారు. ఆవరణలో పచ్చదనం పెంపొందించాలని, ఆహ్లాదకరంగా ఉండేలా చర్యలు చేపట్టాలని ఎస్.ఐ శివప్రసాద్ ను ఆదేశించారు. పోలీస్ స్టేషన్ ఆవరణ పరిశుభ్రంగా ఉంచుకోవాలని పోలీస్ సిబ్బందికి సూచనలు చేశారు.. అనంతరం పోలీస్ స్టేషన్ లోని రికార్డులను పరిశీలించారు. దొంగతనాలు అరికట్టేందుకు గస్తీ ముమ్మరం చేయాలని, నాటుసారా, అక్రమ మద్యం, ఇసుక అక్రమ రవాణా, నిషేధిత గుట్కా పై దాడులు ముమ్మరం చేయాలని ఆదేశించారు. మహిళల భద్రత కు పోలీస్ శాఖ ప్రత్యేకంగా రూపొందించిన 'దిశ' యాప్ పై అవగాహన కల్పించి డౌన్లోడ్ చేసుకోవడంతో పాటు రిజిస్టర్డ్ యూజర్ గా నమోదు చేసుకునేలా వారిలో చైతన్యం తీసుకువచ్చేందుకు కృషి చేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణ కు చర్యలు తీసుకోవాలని, వాహనదారులకు, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కొండాపురం సి.ఐ సుదర్శన్ ప్రసాద్, కలమల్ల ఎస్.ఐ శివప్రసాద్ కు సూచించారు.

# సుందర నగరమే ప్రభుత్వ ధ్యేయం

కడప రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో కడప నగరాన్ని ఆరోగ్యకరమైన సుందర నగరంగా తీర్చిదిద్దుతామని, పేద ప్రజలు నవరత్నాల పథకాలను అందిపుచ్చుకోని లబ్ధి పొంది ఆశీర్వదించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖా మంత్రి ఎస్.బి.అంజాద్ బాషా, నగర మేయర్ కె. సురేష్ బాబు లు సంయుక్తంగా పేర్కొన్నారు. బుధవారం నగరంలోని 50వ డివిజన్ పరిధిలోని కార్పొరేటర్ కె.అరుణ ప్రభ, డివిజన్ ఇంచార్జి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పాలెంపల్లి, రుకావారిపల్లి ప్రాంతాల్లో 26 వ రోజున "గడప గడపకు మన ప్రభుత్వం" కార్యక్రమం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాషా, నగర మేయర్ కె. సురేష్ బాబు లకు మేళతాలలతో, బాణసంచతో ఘనంగా స్వాగతం పలికి, కార్యక్రమం గ్రామోత్సవంలా సాగింది.ఈ సందర్భంగా.. ప్రతి కుటుంబాన్ని పలకరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తోన్న సంక్షేమ పథకాలు, సేవలు పట్ల లబ్ది దారుల మనోగతాన్ని తెలుసుకుంటూ ముందుకు సాగారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వారికి వివరించి, ప్రజలను ఆప్యాయంగా పలకరించి వారిని కలుసుకోవడంతో పాటు, వారు పొందుతున్న లబ్ధి సమాచారంతో కూడిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి సంతకం చేసిన బుక్ లెట్‌ను అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏవిధంగా ప్రజలకు చేరుతున్నాయని.. ఉపముఖ్యమంత్రి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు సంతృప్త స్థాయిలో అందడం.. జగన్ మోహన్ రెడ్డి పారదర్శక పాలనకు అద్దం పడుతోందన్నారు. కరోనా లాంటి ప్రపంచ విపత్కర పరిస్థితుల్లో కూడా.. ప్రజలు ఏ మాత్రం ఆర్థికంగా ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశ్యంతో.. సంక్షేమ పథకాలను నిరంతరాయంగా అమలు చేసిన ఘనత మన ముఖ్యమంత్రికే దక్కుతుందని ప్రశంసించారు. అమ్మఒడి, వైయస్సార్ పింఛన్ కానుక, వైయస్సార్ చేయూత వైయస్సార్ ఆసరా, వైయస్సార్ ఆరోగ్యశ్రీ, వాహనమిత్ర వైయస్సార్ వసతి దీవెన, వైయస్సార్ విద్య దీవెన, పేదలందరికీ ఇల్లు వంటి సంక్షేమ పథకాలను లబ్దిదారులకు వివరిస్తూ... గడపగడపకు ఆయన పర్యటన సాగిందిపేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఒక్కరు కూడా.. సంక్షేమ పథకాలను కోల్పోకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి "గడప గడపకు మన ప్రభుత్వం" కార్యక్రమాన్ని.. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందన్నారు.సిసి రోడ్, డ్రైన్ కాలువకు శంకుస్థాపన ×కడప నగర సుందరికారణలో భాగంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్ బి. అంజాద్ బాషా, నగర మేయర్ కె.సురేష్ బాబు ల చేతుల మీదుగా 15వ ఆర్థిక నిధుల నుండి రూ.8 లక్షలు తో పాలెంపల్లి ప్రధాన రహదారి వద్ద సిసి రోడ్, డ్రైన్ కాలువకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రితో పాటు 50 డివిజన్ కార్పొరేటర్ అరుణ ప్రభ, డివిజన్ ఇంచార్జి రాజశేఖర్ రెడ్డి, వైఎస్ఆర్సిపి నాయకులు అఫ్జల్ ఖాన్, కాల్ టాక్స్ హఫీజుల్లా, ఇతర నగర కార్పొరేటర్లు, వివిధ కార్పొరేషన్ ఛైర్మన్ లు, డైరెక్టర్స్, మున్సిపల్ ఎలెక్ట్రికల్ డీఈ అబిద్, ఏ.ఈ. దిల్షాద్, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీలో చిరుత సంచారం

తిరుపతి తిరుపతి శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీలో చిరుత సంచారం కలకలంరేపుతోంది. యూనివర్శిటీ పరిపాలనా భవనం దగ్గర శునకాలపై చిరుత దాడికి ప్రయత్నించింది. ఈ దృశ్యాలు వర్శిటీలో ఉన్న సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. చిరుత సంచారంతో యూనివర్సిటీ విద్యార్థులు, భద్రతా సిబ్బంది భయాందోళనలో ఉన్నారు. సీసీ ఫుటేజ్ పరిశీలించిన తర్వాత అటవీశాఖ సిబ్బందికి సమాచారం అందించారు.ఎస్వీ యూవర్సిటీకి చేరుకున్న అటవీ సిబ్బంది చిరుత సంచరించిన పరిసరాలను పరిశీలించారు. ఆరు నెలలుగా ఎస్వీ యూనివర్సిటీ, వెటర్నరీ యూనివర్సిటీ, వేదిక్ యూనివర్సిటీ పరిసరాల్లో చిరుతలు తిరుగుతున్నాయని, రెండుసార్లు కుక్కలపై కూడా దాడి చేశాయని విద్యార్థులు చెబుతున్నారు. ఈ నెల 14న మెయిన్ బిల్డింగ్ దగ్గర చిరుత కుక్కలపై దాడికి ప్రయత్నించింది. యూనివర్శిటీలో విద్యార్థులను రాత్రిపూట బయట తిరగవద్దని అధికారులు సూచించారు. గతంలో కూడా చిరుత జాడ ఆ పరిసరాల్లో కనిపించడంతో స్థానికులు కూడా హడలిపోతున్నారు.

# రక్త దానం చేయండి- ప్రాణ దాతలు కండి

## -మంథని మున్సిపల్ ఛైర్మన్ పుట్ట శైలజ

మంథని రక్త దానం చేయండి ప్రాణ దాతలు కండి అని మంథని మున్సిపల్ చైర్మన్ పుట్ట శైలజ యువకులకు పిలుపునిచ్చారు. మంథని పట్టణంలోని ప్రభుత్వ హాస్పిటల్ లో 75సంత్సరాల భారత స్వతంత్ర వజ్రోత్సవ కార్యక్రమంలో భాగంగా మంథని ప్రభుత్వ హాస్పిటల్ లో రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంథని మున్సిపల్ చైర్మన్ పుట్ట శైలజ ముఖ్యఅతిథిగా పాల్గొని రక్తదాతలకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. రక్తదానం చేసిన వారందరిని ఆమే అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తదానం మహాదానమని, రాష్ట్రవ్యాప్తంగా రక్తహీనత తో బాధపడుతున్న వారు అనేకమంది ఉన్నారు. అత్యవసర సమయంలో రక్తం అందించిన వారే అసలైన హీరో అని, రక్తదానం చేయడం వల్ల ఎటువంటి ప్రాణహాని ఉండదని ప్రజలు ఇలాంటి అపోహాలు నమ్మకూడదని, రక్తదానం వల్ల ఇంకొకరి ప్రాణాలు నిలిపిన వారం అవుతామని, కచ్చితంగా ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి అవసరమున్న ఆపద సమయంలో రక్తం దానం చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో మంథని మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, ఎంపీపీ కొండ శంకర్, జడ్పిటిసి తగరం సుమలత శంకర్ లాల్, కౌన్సిలర్లు వీకే రవి, నక్క నాగేంద్ర శంకర్, శ్రీపతి బానయ్య, కాయితి సమ్మయ్య, గర్రెపల్లి సత్యనారాయణ, కుర్ర లింగయ్య, కో ఆప్షన్ మెంబర్స్ అంకరి పద్మజాకుమార్, టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎగొలపు శంకర్ గౌడ్, టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు తగరం శంకర్ లాల్, జిల్లా వైద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి, మంథని ప్రభుత్వాసుపత్రి సూపరిడెంట్ శౌరయ్య, గద్దలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు శంకరా దేవి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# తండ్రి కొడుకు పై హత్యాయత్నం

బద్వేలు బద్వేలు పట్టణం ఆరోగ్యపురంగా బుధవారం ఉదయం తండ్రీకొడుకులపై హత్యా ప్రయత్నం జరిగింది తీవ్రంగా గాయపడిన వారు ప్రస్తుతం కడపలోని ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు ఆరోగ్య పురంలో నివాసం ఉంటున్న ప్రైవేటు టీచర్ కొండా శేషాద్రి రెడ్డి కుమారుడు కార్తీక్ రెడ్డి పై ఈ హత్య ప్రయత్నం జరిగింది. బుధవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో ఇంట్లో ఉన్న శేషాద్రి రెడ్డి అతని కుమారుడు కార్తీక్ రెడ్డి పై పోలేరు అనే వ్యక్తి కత్తితో దాడి చేశాడు. పోలేరు శేషాద్రి రెడ్డి ఇంటికి దగ్గరలోనే గత రెండు సంవత్సరాలుగా తల్లి చెల్లి తో కలిసి నివాసం ఉంటున్నాడు కాశి నాయన మండలం గంగనపల్లె గ్రామానికి చెందిన పోలేరు గత కొంతకాలంగా బెంగళూరు తదితర ప్రాంతాల్లో వంట మాస్టర్ గా పనిచేస్తున్నాడు. ఇటీవలే పోలేరు బద్వేలు కు రావడం జరిగింది స్పష్టమైన కారణాల కోసం పోలీసులు పోలేరు ను తమ అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు సంఘటన జరిగిన కేవలం రెండు గంటల వ్యవధిలోనే అర్బన్ ఎస్సై కత్తి వెంకటరమణ అదుపులోకి తీసుకొని స్టేషన్కు తరలించారు. అతన్ని అన్ని విధాల విచారణ చేస్తున్నారు. కాగా తండ్రీకొడుకులపై జరిగిన హత్యాయత్నంపై స్పష్టమైన కారణాలు తెలియడం లేదు జరిగిన సంఘటనపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు అర్బన్ ఎస్సై కత్తి వెంకటరమణ తెలిపారు.

# అడ్డూ అదుపులేని వైసిపి నాయకులు

ఆళ్లగడ్డ వైసిపి నాయకులు ప్రజాప్రతినిధుల అక్రమాలు అరాచకాలకు అడ్డూ అదుపు లేకుండా పోతుందని మాజీ మంత్రి అఖిల ప్రియా అన్నారు. ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలోని బండ్ల మెట లో లో లారీ లకు వసూలు చేస్తే గేట్ డబ్బులు ఇవ్వలేదని వైసిపి గుత్తేదారుడు నెల్లూరుకు చెందిన లారీ డ్రైవర్ చంద్రశేఖర్ పై చేయి చేసుకోవడం దుర్మార్గమన్నారు. అంతకు ముందు ఆమె సోదరుడు విఖ్యత్ రెడ్డితో కలసి మున్సిపాలిటీ కమిషనర్ రమేష్ బాబు లారీలకు ఎంత వసూలు చేస్తున్నారని అడిగారు. రూ 300 లోపు ఉంటుందని తెలపటంతో రూ 500 ఇవ్వాలని గుత్తేదారుడు డిమాండ్ చేశారని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లింది. అందుకు నిరాకరించిన డ్రైవర్ పై చేయి చేసుకోవడమే కాకుండా లారీ టైర్ లో గాలి తీసివేయడం సరి కాదని అన్నారు. అతడిపై కేసు నమోదు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. కోర్టు తీర్పు ప్రకారం వారి వాళ్ళు గెట్ ఇవ్వకూడదని సరుకులు దించుకున్న వారే గెట్ చెల్లించాలని ఉందని గుర్తు చేశారు. వైసీపీకి చెందినగుంత్తైదారులు. ప్రజా ప్రతినిధులు రెచ్చిపోతున్నారు అని అన్నారు. అక్రమంగా వసూలు చేస్తే డబ్బులో కొంత శాతం ప్రజాప్రతినిధుల జేబుల్లోకి పోతుందని ఆరోపించారు. డ్రైవర్ పై దాడి జరిగిన సంఘటన తెలుసుకున్న నెల్లూరు జిల్లా లారీ యజమానుల సంఘం నాయకులు ఆళ్లగడ్డ కు వచ్చి దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోక పోవడం విచారకరమన్నారు. అహోబిలంలో ఇటీవల అధికంగా వసూలు చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని ఆమె గుర్తు చేశారు.

# ఆటో డ్రైవర్లపై ఈ చలానా పేరుతో చేస్తున్న దాడులు ఆపండి




### ఆర్టిఏ పోలీస్ అధికారులకు సిఐటియు విజ్ఞప్తి...

కర్నూలు ఆగష్టు 17 -: ఆటో డ్రైవర్లపై ఈ చలానా పేరుతో అధిక చలానా లు రాస్తూ ఆటో డ్రైవర్ లను ఇబ్బందులకు గురిచేస్తున్న ఆర్టిఏ ట్రాఫిక్ పోలీసుల వేధింపులు తక్షణమే ఆపాలని లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సిఐటియు నగర ప్రధాన కార్యదర్శులు ఎండి అంజిబాబు రామాంజనేయులు (విజయ్)అధికారులకు తెలియజేశారు. ఈరోజు ఆటో డ్రైవర్ల పై ఆర్టిఏ పోలీసు అధికారుల దాడులకు వ్యతిరేకంగా ఆటో అడ్డాల తొలగింపు చర్యలను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఆటో యూనియన్ సిఐటియు నగర కమిటీ ల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమం న్యూ సిటీ ఆటో యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి బి .రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సిఐటియు నగర ప్రధాన కార్యదర్శులు ఎం.డి అంజిబాబు, మారెళ్ళ రామాంజనేయులు (విజయ్) ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐ.ప్రభాకర్ హాజరై ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతూ.. జగన్ పాదయాత్రలో ఆటోడ్రైవర్లకు అనేక విధాలుగా ఆదుకుంటామని ఆర్థిక సహాయంగా పదివేల రూపాయలు ఇస్తానని మాట ఇచ్చిన మేరకు ఒకపక్క 10,000 ఇస్తూనే మరోపక్క పోలీస్ అధికారుల ద్వారా ఈ చలానా రూపంలో వేలాది రూపాయలు ఫైన్ రాసి రాష్ట్ర ఖజానా ను నింపుకోవడమే జగన్ పనిగా పెట్టుకున్నాడని వారన్నారు గత చాలా సంవత్సరాలుగా ట్రాఫిక్ ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆటో స్టాండ్ లు ఏర్పాటు చేసుకొని ప్రయాణికులకు సేవలందిస్తూ తూ వారి కుటుంబాలను పోషించుకుంటున్న ఆటో స్టాండ్ లపై ట్రాఫిక్కు ఆటోలే అంతరాయం అని తొలగించమని ప్రతిరోజు వేధింపులకు గురి చేయడం భావ్యం కాదని వారన్నారు ఆటో స్టాండ్ ఏర్పాటు చేయాల్సిన బాధ్యతప్రభుత్వానిదే అని కానీ ప్రభుత్వం ఆ పని చేయకుండా ఉన్న అడ్డాలను కూడా తొలగించి ఆటోడ్రైవర్ల కడుపు కొట్టాలని చూస్తే ఉద్యమిస్తామని వారు అన్నారు. ఇప్పటికైనా అధికారుల స్పందించి ఆటో డ్రైవర్ల పై దాడులు ఆపి ఆటో స్టాండ్లను తిరిగి నిర్మించాలని వారన్నారు. అనంతరం ఆటో యూనియన్ నగర ఓల్డ్ సిటీ న్యూ సిటీ అధ్యక్షులు రవి, హుస్సేన్ వలి , ఓల్డ్ సిటీ కార్యదర్శి పి మహమూద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 21 తక్షణమే రద్దు చేయాలని ఆటో డ్రైవర్లపై ఆర్టిఏ ట్రాఫిక్ పోలీసుల వేధింపులు ఆపాలని నగరంలో అనేక వాహనాలతో పాటు ఆటోలు కూడా పెరిగాయని ఉపాధి అవకాశాలు లేక అనేకమంది ఆటోని వృత్తిగా ఎంచుకున్నారని వారు అన్నారు కొందరు చేసే పొరపాట్ల వల్ల ఆటో డ్రైవర్లను వేధింపులకు గురి చేయడం సమంజసం కాదని వారన్నారు. ఆటో స్టాండ్ లో తొలగింపు మానుకోవాలని వారు అధికారులకు విజ్ఞప్తి చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఆఫీ్ కి ఇవ్వడం జరిగింది. ఈ ధర్నా కార్యక్రమంలో ఆటో యూనియన్ సిఐటియు నగర కార్యదర్శివర్గ సభ్యులు పి.నబీ సాహెబ్,ఆ.కుమార్, వలి, ఐటీసీ శీను, మల్లీ ,ఆనంద్, బి టి ఆర్ నగర్ మాలిక్, రవి, నూర్ భాయ్, బడే భమ్, రమేష్, రామ్ మద్దయ్య, ఆటో యూనియన్ నాయకులు ఆటో డ్రైవర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు...

# ఆమెజాన్ లో డ్వాక్రా ఉత్పత్తులు

విజయవాడ, ఆగస్టు 17, పొదుపు సంఘాల మహిళలు తయారు చేసే ఉత్పత్తులు త్వరలో అమెజాన్ ద్వారా డిజిటల్ మార్కెట్‌లోకి రాబోతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పొదుపు సంఘాల మహిళలు దాదాపు 6,000 రకాల ఉత్పత్తులను తయారు చేస్తున్నారు. ఇప్పటివరకు వాటిని డ్వాక్రా బజారుల ద్వారానే విక్రయిస్తున్నారు. ఇప్పుడు అమెజాన్‌తో ఒప్పందం చేసుకోవడం ద్వారా ఆ ఉత్పత్తులకు విస్తృత ప్రాచుర్యం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే వాటిని తయారు చేసే మహిళలకు అధిక ఆదాయం కూడా వస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. వారం కిందట విజయవాడ వచ్చిన అమెజాన్ ప్రతినిధులతో సెర్ప్ ఉన్నతాధికారులు భేటీ అయ్యారు. పొదుపు సంఘాల మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు ప్రత్యేక బ్రాండింగ్ ద్వారా అమెజాన్‌లో చోటు కల్పించేందుకు ఆ సంస్థ ప్రతినిధులు అంగీకారం తెలిపారు. అమెజాన్‌లో అందుబాటులో ఉంచిన ఉత్పత్తులను వినియోగదారుడు కొనుగోలు చేస్తే.. వారికి నిర్ణీత గడువులోగా అందించాల్సి ఉంటుందని అధికారులకు వారు చెప్పారు. అలాగే ఉత్పత్తులను సరఫరా చేసేందుకు స్టాక్ పాయింట్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంటుందని అధికారులకు అమెజాన్ ప్రతినిధులు సూచించారు. దీంతో 6,000 రకాల ఉత్పత్తులను ఒకేసారి కాకుండా.. ఎక్కువ డిమాండ్‌కు అవకాశమున్న వాటితో స్టాక్ పాయింట్ ఏర్పాటు చేసే అంశంపై సెర్ప్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. దీనికి సంబంధించిన విధివిధానాలను అమెజాన్ ప్రతినిధులు ఈ నెల 18న సెర్ప్ అధికారులకు అందజేయనున్నారు. అందుకు తగ్గట్టుగా చర్యలు చేపట్టాలని అధికారులు భావిస్తున్నారు.

# కర్నూలు జిల్లా రుణ ప్రణాళిక లో నిర్దేశించిన లక్ష్యాల మేరకు బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయాలి




### రైతులకు రుణాలు మంజూరులో వ్యవసాయ శాఖ కీలక పాత్ర పోషించాలి

### కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయడం వల్ల భూమి యజమానులకు ఇబ్బంది కలుగకూడదు-:కర్నూలు జిల్లా కలెక్టర్ పి కోటేశ్వరరావు

కర్నూలు , ఆగస్ట్ 17 :- కర్నూలు జిల్లా రుణ ప్రణాళిక లో నిర్దేశించిన లక్ష్యాల మేరకు బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ పి కోటేశ్వరరావు పేర్కొన్నారు..బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన బ్యాంకర్లకు సంబంధించిన డీసీసీ, డీఎల్ఆర్సీ సమావేశాన్ని నిర్వహించారు.. సమావేశంలో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి పాల్గొన్నారు..ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లా రుణ ప్రణాళిక లక్ష్యం రూ.10,537 కోట్ల రుణాల మంజూరు లక్ష్యం కాగా, బ్యాంకర్లు ఇప్పటివరకు 35 శాతం తో రూ.3779 కోట్లు రుణాలు మంజూరు చేశారన్నారు..ప్రధానంగా వ్యవసాయ అనుబంధ రంగాల్లో రుణాల మంజూరు కు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.. ఈ రంగాల్లో రూ .5943 కోట్లు లక్ష్యం కాగా రూ. 2453 కోట్లు మంజూరు చేశారన్నారు. ఇందులో అగ్రికల్చర్ టర్మ్ లోన్స్, అగ్రికల్చర్ఇన్ఫ్రాస్ట్రక్చర్, అనుబంధ రంగాలకు సంబంధించి రుణాల మంజూరు లో బ్యాంకులు చాలా వెనుకబడి ఉన్నాయని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు.. రుణాలు మంజూరు చేయించాలని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలోనూ , స్పందన కార్యక్రమం లోనూ సమస్యలు వస్తున్నాయని, బ్యాంకర్లు సానుకూల దృక్పథంతో వ్యవహరించి రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ సూచించారు. అగ్రి టర్మ్ లోన్స్ కు సంబంధించి కెనరా బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఏపీజీబీ, యాక్సిస్ బ్యాంక్, ష్టటటఇ, అగ్రి తినిటతీజీ కు సంబంధించి కెనరా బ్యాంక్, సిటీ యూనియన్ బ్యాంక్, అనుబంధ రంగాల్లో హెచ్ డి ఎఫ్ సి బ్యాంక్ మాత్రమే రుణాలు మంజూరు చేశాయన్నారు. మిగిలిన బ్యాంకులన్నీ ఈ రుణాల మంజూరు లో చాలా వెనుక బడి ఉన్నాయని కలెక్టర్ తెలిపారు.. బ్యాంకర్లు నిర్దేశించిన లక్ష్యాల మేరకు అన్ని రంగాలకు రుణాలు మంజూరు చేయాలన్నారు.. ఈ ఇకపై ఈ అంశంపై ప్రతినెలా బ్యాంకర్లతో సమావేశం ఏర్పాటు చేసి సమీక్షను నిర్వహిస్తామన్నారు.. వ్యవసాయ రంగంలో రుణాల మంజూరులో వ్యవసాయ శాఖ కూడా కీలక పాత్ర పోషించాలని కలెక్టర్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మిని ఆదేశించారు.. రైతులను బ్యాంకర్ల వద్దకు తీసుకెళ్లి రుణాలు మంజూరు చేయించాలని సూచించారు. కౌలు రైతుల రుణాల వల్ల భూమి యజమానులకు ఇబ్బంది కలుగకూడదుకౌలు రైతుకు రుణం మంజూరు చేయడం వల్ల, భూమి యజమానికి ఇతర రుణాలు మంజూరు చేయడం లేదని నిన్న జరిగిన జడ్పీ సర్వసభ్య సమావేశంలో జడ్పిటిసిలు లేవనెత్తిన అంశంపై కలెక్టర్ బ్యాంకర్లతో చర్చించారు..కౌలు రైతుకు, భూమికి సంబంధం లేదని, సిసిఆర్సి కార్డు ఉన్న కౌలు రైతుకు పంట మీదనే రుణం ఇస్తారని, ఈ నేపథ్యంలో భూమి యజమానికి ఇతర అభివృద్ధి రుణాలు ఇవ్వడంలో సమస్య ఏంటి అని కలెక్టర్ బ్యాంకర్లను ప్రశ్నించారు.. ఇందుకు బ్యాంకర్లు స్పందిస్తూ, ఒకే సర్వే నంబర్ మీద చార్జ్ మాడ్యూల్ క్రియే ట్ అవ్వడం వల్ల భూమి యజమానికి ఇతర రుణాలు మంజూరు చేయడానికి వీలు కావడం లేదని కలెక్టర్కు వివరించారు.. చార్జి మాడ్యూల్ లో క్రాప్, ల్యాండ్ అని రెండు ఆప్షన్లు పెడితే ఇబ్బంది ఉండదని బ్యాంకర్లు కలెక్టర్ దృష్టికి తెచ్చారు.. ఈ మేరకు డి సి సి లో తీర్మానం చేసి రాష్ట్ర స్థాయికి పంపి మాడ్యూల్ లో రెండు ఆప్షన్లు ఉండేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు..

# విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న భాష్యం విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి -:ఎస్ ఎఫ్ ఐ


### విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్న భాష్యం స్కూల్ పై చర్యలు తీసుకోవాలి అని ఎస్ ఎఫ్ ఐ , నంద్యాల జిల్లా కార్యదర్శి నిరంజన్ డిమాండ్ చేశారు.



నంద్యాల ఆగష్టు 17 -: ఈ సందర్భంగా బుధవారం ఎస్ ఎఫ్ ఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నంద్యాల పట్టణంలోని ాఃఎ కాలనీలో ఉన్న భాష్యం స్కూల్ యాజమాన్యం ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల కంటే అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నా అధికారులు స్పందించకపోవడం చాలా దౌర్భాగ్యం అని అన్నారు,పాఠశాలకు ఎలాంటి ఆటస్థలం లేకుండా, విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు లేకుండా, మునిసిపల్ సర్టిఫికెట్ లేకున్నా పాఠశాల నిర్వహిస్తున్నారు. అదేవిధంగా ఒకే బిల్డింగులో పాఠశాల కళాశాల నిర్వహిస్తున్నారు. పాఠశాల నిబంధల ప్రకారం పాఠశాలలో స్టేషనరీ, అంగట్లో అమ్మవల్లసిన సరుకులు అమ్మాకూడదు దానికి విరుద్ధంగా భాష్యం స్కూల్ లో అమ్ముతున్నారు విద్యా శాఖ అధికారులు వెంటనే స్పందించి పాఠశాల పై చర్యలు తీసుకోవాలి అని కోరుతున్నాము లేకపోతే విద్యా శాఖ అధికారుల కార్యాలయాలు ముట్టడిస్తామని,పాఠశాల ఎదుట ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నంద్యాల పట్టణ కార్యదర్శి బాలకృష్ణ అద్యక్షులు తేజ,నాయకులు సాయి,మదు, తదితరులు పాల్గోన్నారు.

# 'ఆది పురుష్' తెలుగు రైట్స్ ఎవరికి దక్కాయి?

'బాహుబలి' సిరీస్ సినిమాల తరువాత ప్రభాస్ పాన్ ఇండియా స్టార్ గా మారిన విషయం తెలిసిందే. ఈ మూవీ తరువాత తను చేసే ప్రతి సినిమా పాన్ ఇండియా లెవెల్లో వుండేలా ప్లాన్ చేసుకుంటున్నాడు. మేకర్స్ కూడా ప్రభాస్ మార్కెట్ ని దృష్టిలో పెట్టుకుని వంద కోట్ల భారీ బడ్జెట్ లతో సినిమాలు నిర్మిస్తున్నారు. దీంతో ప్రభాస్ సినిమాలకు బిజినెస్ కూడా అదే స్థాయిలో జరుగుతూ వస్తోంది. భారీ పోటీ కూడా నెలకొంటోంది. ఇప్పుడు అలాంటి పోటీనే




ప్రభాస్ నటించిన తొలి మైథలాజికల్ మూవీ 'ఆది పురుష్' విషయంలో నెలకొందని తెలుస్తోంది. వివరాల్లోకి వెళితే.. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ మూడు భారీ ప్రాజెక్ట్ లలో నటిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో బాలీవుడ్ డైరెక్టర్ ఓం రౌత్ డైరెక్షన్ లో మైథలాజికల్ మూవీ 'ఆది పురుష్'లో నటిస్తున్నాడు. ఈ మూవీ షూటింగ్ పూర్తయి పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటోంది. మరో రెండు సినిమాలు 'సలార్' ప్రాజెక్ట్ కె దాదాపు యాభై శాతం చిత్రీకరణ పూర్తి చేసుకున్నాయి. ఈ మూడు సినిమాలలో ముందుకు ప్రేక్షకుల ముందుకు మైథలాజికల్ డ్రామా 'ఆదిపురుష్' రిలీజ్ కాబోతోంది. వాల్మీకీ రామయణం ఆధారంగా ఈ మూవీని తెరకెక్కిస్తున్నారు. జపనీస్ మూవీ 'రామాయణ ద లెజెండ్ ఆఫ్ ప్రిన్స్ రామా స్ఫూర్తితో టి. సిరీస్ రెట్రో ఫైల్స్ బ్యానర్ లపై అధినేతలు భూషన్ కుమార్ కిషన్ కుమార్ ఓం రౌత్ ప్రసాద్ సుతార్ రాజేష్ నాయర్ అత్యంత భారీ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా దాదాపు రూ. 500 కోట్లతో నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది జనవరి 12న ఈ మూవీ వరల్డ్ వైడ్ గా హిందీ తెలుగు తమిళ మలయాళ కన్నడ భాషల్లో విడుదల కానుంది. హిందీలో ఈ మూవీని అనిల్ తడానీ భారీ స్థాయిలో రిలీజ్ కు ప్లాన్ చేస్తున్నారు. అయితే తెలుగు రిలీజ్ కు సంబంధించిన తాజాగా ఓ ఆసక్తికరమైన వార్త ఒకటి బయటికి వచ్చింది. ఈ మూవీ తెలుగు రైట్స్ కోసం భారీ పోటీ నెలకొందట. అయితే ఈ పోటీలో ప్రభాస్ కు సంబంధించిన యువీ క్రియేషన్స్ సంస్థ దాదాపు రూ. 100 కోట్లకు దక్కించుకున్నట్టుగా వార్తలు వినిపిస్తున్నాయి. ఇంగ్లీష్ వెర్షన్ ని కూడా విదేశాల్లో విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట. అయితే ఈ మూవీ తెలుగు రైట్స్ విషయంలో మాత్రం యువీ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాకపోవడం గమనార్హం. తాజా డీల్ ఎంత వరకు నిజం అన్నది తెలియాలంటే యువీ వారు అధికారిక ప్రకటన చేసే వరకు వేచి చూడాల్సిందే.

# సినిమా కోసం జీవితాంతం తోడు లేకుండా తేజస్వీ ప్రయాణం!

విజయవాడ బ్యూటీ తేజస్వీ మడివాడ సుపరిచియతే. 'సీతమ్మవాకిట్లో సిరిమల్లె చెట్టు'తో తెరంగేట్రం చేసిన బ్యూటీ అటుపై 'మనం'..'హార్ట్ ఎటాక్' చిత్రాల్లో సపోర్టింగ్ రోల్స్ తో మెప్పించింది. కానీ ఆవేవి అమ్మడికి అంతగా గుర్తింపు తీసుకురాలేదు. అదే సమయంలో సంచలనాల రాంగోపాల్ వర్మ దృష్టిలో పడింది. తేజస్వీతో వర్మ తెరకెక్కించిన 'ఐస్క్రీమ్' తో వెలుగులోకి వచ్చింది. వర్మ క్రియేటివిటీని అందుకుని పెర్ఫార్మెన్స్ చేయడంలో తనదైన మార్క్ వేసింది. అప్పటి నుంచి ఐస్ క్రీమ్ బ్యూటీగా పాపురలర్ అయింది. ఆ తర్వాత కొన్నాళ్ల పాటు వరుసగా సపోర్టింగ్ రోల్స్ తో మెప్పించింది. కానీ ఇదంతా అమ్మడు తెరపై కనిపించిన తీరుకు మాత్రమే గుర్తింపు దక్కింది. నటిగా మాత్రం ముద్రని వేయలేకపోయింది. ఈ క్రమంలో చాలాకాలం పాటు గ్యాప్ తప్పలేదు. కొన్నాళ్లగా ఎలాంటి అవకాశాలు లేకుండా ఖాళీగానే ఉంది. ఈ క్రమంలోనే బిగ్ బాస్ లో అవకాశం



వచ్చి వెళ్లడంతో ఇంకాస్త పాపులర్ అయింది. తాజాగా తేజస్వీ ప్రధాన పాత్రలో 'కమిట్ మెంట్ 'చిత్రం తెరకెక్కింది. ఈ సినిమా ప్రమోషన్ లో భాగంగా అమ్మడు వృత్తి..వ్యక్తిగతానికి సంబంధించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది."కమిట్ మెంట్ వాస్తవ కథతో తెరకెక్కింది. కథ విన్నప్పుడు నాకు ఎదురైన చాలా సంఘటనలు సినిమాలో ఉన్నట్లు అనిపించింది. ఈ కథకు కనెక్ట్ అవ్వడానికి అదే కారణం. నాలుగు కథలతో తెరకెక్కిన కమిట్ మెంట్ లో నాదొక కథ. సహజమైన కథ..పాత్ర కావడంతో ఈ సినిమా తో నేను అనుకున్నవన్ని నిజమవుతాయన్న నమ్మకం ఉంది' అంటోంది. ఇక సినిమా అనే మజిలీ కోసం అమ్మడు చాలా కోల్పోయినట్లు కూడా రివీల్ చేసింది. ఇంట్లో పెళ్లి చేసుకోమన్నా చేసుకోవడం లేదుట. ఒకవేళ వివాహం చేసుకుంటే మాత్రం వెంటనే సినిమాలు మానేయలని కుటుంబ సభ్యులు కండీషన్ పెట్టారుట. దీంతో పెళ్లి అనే ఆలోచనే మనసులో నుంచి తొలగించిందిటల. అందుకే ఇంత వరకూ పెళ్లి చేసుకోలేదని..ఇకపై చేసుకునే ఆలోచన కూడా లేదని తెలిపింది. సినిమాపై వ్యామోహం అలాంటింది. ఇండస్ట్రీకి సక్సెస్ అవ్వాలని ఎంతో మంది వస్తుంటారు. అందులో కొంత మంది సక్సెస్ అవుతారు. మరికొంత మంది ప్రయత్నించి విఫలమై తిరిగి ఇంటికెళ్లిపోతుంటారు. ఇక సక్సెస్ కానంత వరకూ ఇండస్ట్రీ కష్టాల కడలని ఈదాల్సిందే. సక్సెస్ వచ్చే వరకూ కమిట్ మెంట్ తో పనిచేసుకుంటూ వెళ్లిపోవడమే. ఆ విజయం చెంత చేరిన నాడే ఆ కష్టాలకు ఫుల్ స్టాప్ పడేది.

# బింబిసార 2... బాలయ్య ఉంటాడా?

నందమూరి కళ్యాణ్ రామ్ హీరోగా వశిష్ఠ్ దర్శకత్వంలో రూపొంది ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చి భారీ విజయాన్ని సొంతం చేసుకున్న బింబిసార సినిమా కు సీక్వెల్ రాబోతుందని ఇప్పటికే అధికారిక ప్రకటన వచ్చింది. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం బింబిసార సినిమాకు సీక్వెల్ కాకుండా ప్రీక్వెల్ గా బింబిసార 2 రాబోతుందనే సమాచారం అందుతోంది. బింబిసార సినిమా కు ముందు మెగా హీరో అల్లు శిరీష్ తో ఒక సినిమా ను గీతా ఆర్ట్స్ లో వశిష్ఠ్ చేయాల్సి ఉంది. కాని కొన్ని కారణాల వల్ల ఆ సినిమా క్యాన్సిల్ అయ్యింది. ఇప్పుడు మళ్లీ వశిష్ఠ్ తో ఆ సినిమాను చేయాలని గీతా ఆర్ట్స్ వర్గాల వారు భావిస్తున్నారట. కాని బింబిసార 2 కు సంబంధించిన చర్చలు జరుగుతున్నాయి. ఏ సినిమా ముందు అవుతుందో చూడాలి. మరో వైపు బింబిసార సినిమా ను చూసిన బాలకృష్ణ మాట్లాడుతూ వశిష్ఠ్ పనితనంపై ప్రశంసలు కురిపించాడు. ఇదే సమయంలో తప్పకుండా కలిసి సినిమా చేద్దామని కూడా హామీ ఇచ్చాడు. దాంతో ఇద్దరి కాంబోలో సినిమా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. ఒక వేళ బింబిసార సినిమా యొక్క రెండవ పార్ట్ లో మంచి పాత్ర ఉంటే తప్పకుండా బాలయ్య నటించే అవకాశం ఉంది. కళ్యాణ్ రామ్ మరియు బాలయ్య లు కలిసి నటించాలని అభిమానులు కోరుకుంటున్నారు. కనుక బింబిసార 2 సినిమా ను ఖచ్చితంగా నందమూరి అభిమానుల కోసం ఫ్యామిలీ మల్టీస్టారర్ గా మారిస్తే బాగుంటుందనే అభిప్రాయం ను వ్యక్తం చేస్తున్నారు. బాలయ్య కు బింబిసార కాన్సెప్ట్ నచ్చింది. కనుక సీక్వెల్ లేదా ప్రీక్వెల్ లో నటించేందుకు ఎలాంటి అడ్డంకి చెప్పక పోచ్చు. మొత్తానికి నందమూరి కళ్యాణ్ రామ్ బింబిసార చుట్టు ఆసక్తికర చర్చ జరుగుతోంది. రెండవ పార్ట్ కథ విషయంలో కూడా రకరకాలుగా పుకార్లు షికార్లు చేస్తున్నాయి. బింబిసార సినిమా లో బింబిసారుడు చనిపోయాడు కనుక అంతకు ముందు జరిగిన కథను చూపించే అవకాశాలు కనిపిస్తున్నాయి. కళ్యాణ్ రామ్ కెరీర్ లోనే బిగ్గెస్ట్ హిట్ గా బింబిసార నిలిచింది. కనుక ఏమాత్రం ఆలస్యం చేయకుండా బింబిసార 2 ను కూడా మొదలు పెట్టే అవకాశాలు ఉన్నాయి.



# న్యూజిలాండ్‌తో తొలి వన్డే.. ఆరేళ్ల తర్వాత విండీస్ ఆటగాడు రీ ఎంట్రీ!




న్యూజిలాండ్‌తో తొలి వన్డేకు ముందు వెస్టిండీస్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు స్టార్ ఆటగాడు షిమ్రాన్ హెట్‌మైర్‌తో సహా ఆల్‌రౌండర్ కీమో పాల్, స్పిన్నర్ గుడాకేష్ మోటీ కివీస్ సిరీస్ మొత్తానికి దూరమయ్యారు. హెట్‌మైర్ వ్యక్తిగత కారణాల వల్ల ఈ సిరీస్ నుంచి వైదొలగగా.. కీమో పాల్,మోటీ గాయం కారణంగా తప్పుకున్నారు. ఇక హెట్‌మైర్ స్థానంలో జెర్మైన్ బ్లాక్‌వుడ్‌ను విండీస్ క్రికెట్ ఎంపిక చేసింది. బ్లాక్‌వుడ్ టెస్టు క్రికెట్‌లో క్రమం తప్పకుండా ఆడుతున్నప్పటికీ.. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో మాత్రం అతడికి గత కొన్నాళ్లుగా చోటు దక్కడం లేదు. బ్లాక్‌వుడ్ చివరగా 2015లో విండీస్ తరపున వన్డేల్లో ఆడాడు. ఇక గుడాకేష్ మోటీ స్థానంలో లెగ్ స్పిన్నర్ యాన్నిక్ కారియాకు చోటు దక్కింది. ఈ సిరీస్‌తో కారియా విండీస్ తరపున అంతర్జాతీయ అరంగేట్రం చేయనున్నాడు. దేశీవాళీ టోర్నీల్లో అద్భుతంగా రాణించడంతో కారియాను ఎంపిక చేశారు. ఇక ఇప్పటికే న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌ను కోల్పోయిన విండీస్ కనీసం? వన్డే సిరీస్‌లోనైనా గెలిచి పరువు దక్కించుకోవాలని భావిస్తోంది. కింగ్‌స్టన్ ఓవల్ వేదికగా బుధవారం జరగనున్న తొలి వన్డేతో ఈ సిరీస్ ప్రారంభం కానుంది. కాగా ఇరు జట్లు మధ్య మూడు వన్డేలు కూడా కింగ్‌స్టన్ ఓవల్ వేదికగానే జరగనున్నాయి.

# ఎఫ్‌టీపీ ప్రకటించిన ఐసీసీ.. నాలుగేళ్లలో 777 అంతర్జాతీయ మ్యాచ్‌లు!

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్(ఐసీసీ) పురుషుల క్రికెట్‌కు సంబంధించిన ఫ్యూచర్ టూర్ ప్రోగ్రామ్ (ఎఫ్‌టీపీ)ని బుధవారం విడుదల చేసింది. 2023 నుంచి 2027 కాలానికి గాను పూర్తి షెడ్యూల్‌ను ఐసీసీ ప్రకటించింది. ఇందులో ద్వైపాక్షిక సిరీస్‌లతో పాటు 2023 వన్డే ప్రపంచకప్, ఛాంపియన్స్ ట్రోఫీ, రెండు టీ20 వరల్డ్‌కప్స్‌తో పాటు రెండు వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఎడిషన్‌లు కూడా ఉన్నాయి. కాగా 2019-23 ఫ్యూచర్ టూర్ ప్రోగ్రామ్ కంటే తాజా షెడ్యూల్‌లో మూడు ఫార్మాట్‌లోనూ మ్యాచ్‌ల సంఖ్య పెరిగింది. ఇక 2023-27 ఎఫ్‌టీపీ లో 777కి పైగా మ్యాచ్‌లు ఉన్నాయి. వాటిలో 173 టెస్టులు, 281 వన్డేలు, 323 టీ20 మ్యాచ్‌లు ఉన్నాయి. "ఫ్యూచర్ టూర్ ప్రోగ్రామ్‌లో భాగంగా రాబోయే నాలుగేళ్ల గానూ ఈ షెడ్యూల్ రూపొందించడానికి చేసిన కృషికి మా సభ్యులకు ధన్యవాదాలు చెప్పాలనుకుంటున్నాను. ఇందులో ఐసీసీ ఈవెంట్‌లతో పాటు, ద్వైపాక్షిక సిరీస్‌లు, టెస్టు సిరీస్‌లు ఉన్నాయి. మూడు ఫార్మాట్‌ల క్రికెట్ అభివృద్ధి చెందేలా ఈ ఎఫ్‌టీపీ రూపొందించబడింది" అని ఐసీసీ జనరల్ మేనేజర్ వసీం ఖాన్ పేర్కొన్నాడు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**